
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కరీంనగర్
: fb.com/vaartha
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-10-2024 గురువారం సంపుటి: 30 సంచిక: 273 పేజీలు: 8+16 వెల: 6.50



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
కరీంనగర్
31-10-2024 గురువారం సంపుటి: 30 సంచిక: 273 పేజీలు: 8+16 వెల: 6.50
epaper.vaartha.com WWW.VAARTHA.COM fb.com/vaartha
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam



బుధవారం 28 లక్షల దీపాలతో వెలిగిపోతున్న అయోధ్య సరయూ తీరం

## శుభాకాంక్షలు

దీపావళి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.
-డా.గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్



## సెలవు

పండుగ సందర్భంగా గురువారం 'వార్త' కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 2వ తేదీ శనివారం


గాంధీభవన్‌లో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

### తెలంగాణ 'కులగణన'
# దేశానికే ఆదర్శం

### నవంబరు 31లోగా పూర్తి చేసి కేంద్రంపై యుద్ధం ప్రకటిద్దాం
### సామాజిక న్యాయం ప్రకారం ప్రభుత్వ ఆదాయంలో వాటాలు
### చట్టం అమలు చేస్తాం.. వ్యక్తిగత అజెండా కాదు..
### ఎవరైనా ఇష్టానుసారం మాట్లాడితే సహించం
### గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** కులగణన నవంబర్ 31 లోగా పూర్తి చేసి తెలంగాణ నుంచి నరేంద్రమోడీపై యుద్ధ ప్రకటన చేయాలని కార్యకర్తలు భవిష్యత్ యుద్ధం కోసం సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం గాంధీభవన్‌లో కులగణనపై టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలను నాయకులను ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయం సామాజిక న్యాయం ప్రకారం పంపిణీ చేయడానికి కులగణన ఒక ఎక్స్‌రే మాత్రమే కాదని ఇదొక మెగా హెల్త్‌క్యాంపని ఆయన అభివర్ణించారు. తెలంగాణ మోడల్ దేశంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేలా >>2

### ఉద్యోగులకు దీపావళి కానుక
# 3.64% డిఎ
### ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు30:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి పండుగపూట గుడ్ న్యూస్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం(డిఏ) పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు 3.64శాతం డిఏ పెంచగా ఇది 2022 జూలై 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొంది.ఈ పెరిగిన డిఏ నవంబర్ జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లింపులు చేయనున్నారు. ఇక 2022 జూలై నుంచి 2024 అక్టోబర్ 31 వరకు గల డిఏ బకాయిలను జిపిఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చిలోపు రిటైర్ అయ్యే ఉద్యోగుల >>2



## టిటిడి చైర్మన్‌గా బిఆర్ నాయుడు
### 24 మంది సభ్యులతో కొత్త బోర్డు

**విజయవాడ, అక్టోబరు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి నూతన చైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు.24 మంది సభ్యులతో టీటీడీ బోర్డు ఏర్పాటు కానుంది.ఆ మేరకు టీటీడీ అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. బోర్డు సభ్యులుగా జగ్గంపేట ఎంఎల్‌ఏ జ్యోతుల నెహ్రూ, >>2

### బిసి రిజర్వేషన్ల అమలుకు
# ప్రత్యేక కమిషన్
### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 30 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడానికి వీలుగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం డా. కె.కృష్ణమూర్తి కేసులో త్రిసభ్య ధర్మాసనం వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో వెలువరించిన ఆదేశాలను పాటించి రాష్ట్రంలో కూడా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉదయం హైకోర్టు 11వ కోర్టులో జరిగిన వాదనల అనంతరం జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ పిటీషనర్ తరఫున వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం పిటీషనర్ ఆర్.కృష్ణయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలను సమర్థించింది. కేసు పూర్వాపరాలను పరిశీలించగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బి.సి కమిషన్‌కు స్థానిక సంస్థల ఎన్నికలలో బి.సి రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించింది. బిసి కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తింపు ఇచ్చింది. అయితే తెలంగాణ ప్రభుత్వం బిసి కమిషన్‌నే డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తించడాన్ని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తప్పుపట్టారు. బిసిలకు రాజకీయ రిజర్వేషన్లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా హైకోర్టులో సవాల్ చేస్తూ ప్రజాప్రయోజనాల వ్యాజాయన్ని వేశారు. ఆర్.కృష్ణయ్య వేసిన వ్యాజ్యాన్ని పరిశీలించి, వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలలో ప్రధానంగా.. డా. కె.కృష్ణమూర్తి తీర్పులోని పేరా 60, వికాస్ కిషన్‌రావు గవాలి కేసు తీర్పులోని పేరా 13లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తితో ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లోగా నియమించాలని ఆదేశిస్తూ నియమించిన వివరాలను హైకోర్టుకు తెలపాలని ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.
గౌరవ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని ఆదేశించడంపట్ల జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బిసి భవన్ విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హర్షం ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి >>2

# మయోనైజ్ ఫుడ్‌పై నిషేధం



### ఉత్తర్వులు జారీ చేసిన వైద్య,ఆరోగ్య శాఖ
### ఫుడ్ సేఫ్టీ అధికారులతో మంత్రి దామోదర సుదీర్ఘ సమీక్ష
### జిల్లాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశం
### 2 టాస్క్‌ఫోర్స్ కమిటీలు, 5 మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్న మయోనైజ్‌ను ప్రభుత్వం నిషేధించింది. దీనికి సంబం ధించి వైద్య,ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసిం ది. ఈమేరకు బుధవారం ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యమంత్రి దామోదర రాజనర్సింహ్మ ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మయోనైజ్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నందినగర్‌లో మోమోస్‌లో మయోనైజ్ తిని ఓ మహిళ మృతి చెందగా, మరో 20 మంది దాకా ఆసుపత్రుల పాలయ్యారు. అలాగే, నగరంలోని పలు ప్రముఖ రెస్టారెంట్లలో కూడా తరచూ ఇలాంటి ఘటనలు జరగడంతో వీటి తయారీపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవలి కాలంలో ఫెడ్ సేఫ్టీ అధికారులు ప్రతీ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు చేస్తూ భారీగా పెనాల్టీ విధించారు. కొన్నింటిని సీజ్ కూడా చేశారు. ప్రతీ చోట పాడైన మయోనైజ్ ఉండటాన్ని అధికారులు గమనించారు. ఈ విషయాలన్నింటినీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర >>2

# 'మహాయుతి' కూటమికి చెల్లు!
### కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల



**ముంబయి, అక్టోబర్ 30:** మహారాష్ట్రలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇక మహాయుతి కూటమి పనైపోయిందని జోస్యం చెప్పారు. మహావికాస్ అఘాడీలోని అన్ని పార్టీలకు కాంగ్రెస్ సమాన గౌరవం ఇచ్చిందని, అందుకే అందులో ఎలాంటి అలకలు, కొట్లాటలు లేవని ఆయన అన్నారు. తిరుగుబాటుదారులందరూ నామినేషన్లు ఉపసంహరించుకునేలా చూడాలని తమ పార్టీ నాయకుడు నసీం ఖాన్‌ను సమాజ్‌వాది పార్టీతో మాట్లాడాల్సిందిగా కోరామని, నవంబర్ 4 నాటికి సమస్య పరిష్కారమవుతుందని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే మహాయుతిలో శిసేన, ఎన్సీపిలకు దక్కాల్సిన సీట్లను కూడా బిజెపి లాగేసుకుందని విమర్శించారు. ఎన్నికల్లో మహాయుతి నేతలు పోటీ చేస్తున్నట్లు లేదని కేవలం బిజెపి నేతలే పోటీ చేస్తున్నట్లుందని అన్నారు. మహారాష్ట్రలో ఎంవిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని రమేష్ చెన్నితాల తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ కూటమి పక్షాలు క్రమశిక్షణతో పోరాడతాయని చెప్పారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల నామినేషన్ గడువు ముగిసినప్పటికీ, అధికార మహాయుతి కూటమి ఇంకా నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయలేదు. మరోవైపు శివసేన, కాంగ్రెస్, ఎన్సీపి నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ సైతం 11 స్థానాల్లో అధికారికంగా అభ్యర్థుల పేర్లను వెల్లడించలేదు. ఇప్పటివరకు బిజెపి 152 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపగా అజిత్ పవార్ వర్గం నుంచి 53 మంది ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 80 మంది పేర్లను అధికారికంగా ప్రకటించాయి. దీంతో అధికార పక్షానికి సంబంధించి మొత్తంగా 284 స్థానాల్లో అభ్యర్థులు ఖరారు కాగా మిగతా నాలుగు సీట్లపై సందిగ్ధత నెలకొంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

### లారెన్స్ హత్యకు బంబిహా
# ముఠా కుట్ర!
### వెల్లడించిన పోలీసులు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ హత్యకు మరో క్రిమినల్ ముఠా బంబిహా నాయకుడు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. తన గ్యాంగ్ పలుకుబడిని పెంచుకోవడానికి బిష్ణోయ్ అడ్డం తొలగించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. బంబిహా ముఠా నాయకుడు కుశాల్ చౌద్రీ తన అనుచరుడు పవన్ షూకీన్ అలియాస్ సోనూతో కలిసి ఓ పథకం పన్నినట్లు తెలిసింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న పవన్ ఇద్దరు షార్ప్ షూటర్లను పురమాయించి అక్టోబర్ 26న ఢిల్లీ రాణీబాగ్‌లోని ఓ వ్యాపారవేత్త ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి కాల్పులు జరిపించాడు. అనంతరం అతడిని రూ.15 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. లేకపోతే మరణం తప్పదని హెచ్చరించడంతో ఆ వ్యాపారవేత్త కూడా డబ్బు ఇవ్వడానికిసిద్ధమయ్యాడు. ఈ లోపు ఇద్దరు షార్ప్ షూటర్లను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సెమీ ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిని విచారించగా లారెన్స్‌ను చంపేందుకు ఢిల్లీ జైల్లో ఉన్న కుశాల్ చౌద్రీ ప్లాన్ చేస్తున్నట్లు తేలింది. దీనిలో భాగంగా డబ్బులు సమీకరించేందుకు ఆ వ్యాపారవేత్తను బెదిరించినట్లు గుర్తించారు. కుశాల్‌ను 2019లో థాయ్‌ల్యాండ్‌లో అరెస్టు చేసి భారత్‌కు తరలించారు. ఆ తర్వాత ఎన్ఐఏ అతడి స్థావరాలపై వరుసగా దాడులు చేసి కట్టడి చేసింది. గాయకుడు సిద్ధూమూసేవాల హత్యకు ప్రతీకారంగా లారెన్స్ చంపుతానని అతడు 2022లో సోషల్ మీడియాలో ప్రకటించాడు. గతేడాది పోలీస్‌కస్టడీలో ఉండగా ఇతడు ఆత్మహత్యకు యత్నించినట్లు వారలు వచ్చాయి. మరోవైపు లారెన్స్ కూడా కుశాల్‌ను అంతం చేయాలని చూస్తున్నాడు. ఇటీవల సబర్మతి జైల్లో అతడిని ఎన్ఐఏ ప్రశ్నించగా తన హిట్‌లిస్ట్‌లో బంబిహా గ్యాంగ్ నాయకుడు ఉన్నట్లు చెప్పాడని సమాచారం. ఇటీవల మహారాష్ట్ర రాజకీయ నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యతో లారెన్స్ మరోసారి దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.

## మహారాష్ట్ర ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు30:** మహారాష్ట్ర,జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లను నియమించారు. ఈ మేరకు బుధవారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి,ఎంపీ కుమారి సెల్జా 40 మంది స్టార్ క్యాంపెయినర్ల పేర్లతో ఎన్నికల సంఘానికి లేఖలో పేర్కొంది. మహారాష్ట్ర ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు జాబితాలో ఉంది. ఎఐసిసి చీఫ్ మల్లిఖార్జున ఖర్గే, >>2

## నవంబర్ 17, 18న గ్రూప్ -3 పరీక్ష


**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-3 పోటీ పరీక్షను నవంబర్ 17,18తేదిల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ జారీచేసింది. 2022 డిసెంబరు 30న 29/2022 ద్వారా గ్రూప్ -3 నోటిఫికేషన్ జారీచేశారు. నవంబర్ 17న రెండు విడుతలలో పరీక్ష ఉంటుంది. మొదటి విడుత తొలి పరీక్ష పేపర్ -1 ఉదయం పది గంటలకు మొదలై మధ్యాహ్నం 12:30కు ముగుస్తుంది. మధ్యాహ్నం 3:00 గంటలకు రెండో పరీక్ష పేపర్ -2 మొదలై సాయంత్రం ఐదున్నరకు ముగుస్తుంది. అలాగే నవంబర్ 18న ఉదయం >>2

## సల్మాన్‌ఖాన్‌కు మళ్లీ బెదరింపు కాల్స్!



**ముంబయి, అక్టోబర్ 30:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు వరుస బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా గుర్తుతెలియని ఓ వ్యక్తి నుంచి ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు సందేశం వచ్చింది. రూ.రెండుకోట్లు చెల్లించకపోతే నటుడిని చంపేస్తామని బెదిరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఇటీవల ఓ ఆగంతకుడి నుంచి సందేశం వచ్చిన విషయం తెలిసిందే. ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే మాజీ ఎమ్మెల్యే సిద్దిఖీ కంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని అందులో ఉంది. అనంతరం అతడు మరో సందేశం పంపించాడు. నేను కావాలని బెదిరింపలకు పాల్పడలేదు. అనుకోకుండా జరిగిపోయింది. క్షమించండి అని పేర్కొన్నాడు. అయినప్పటికీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఝార్ఖండ్ పోలీసులు సాయంతో జంషెడ్‌పూర్ చెందిన ఓ కూరగాయల వ్యాపారి ఇదంతా చేసినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు లారెన్స్ బిష్ణోయ్‌గ్యాంగ్ నుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయ్యాయి. ఆయన స్నేహితుడు, ఎన్సీపి నేత బాబా సిద్దిఖీ ఇటీవల దారుణ హత్యకు గురయ్యారు. దీంతో మరోసారి బిష్ణోయ్ గ్యాంగ్ పేరు తెరపైకి వచ్చింది.

### రైల్వే సాంకేతికతపై
# భారత్-స్విస్ మధ్య ఒప్పందం


రైల్వే సాంకేతికతపై భారత్-స్విస్‌ల మధ్య కుదిరిన ఒప్పందంపై సంతకాలు చేస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, స్విస్ రవాణా శాఖ అధిపతి ఆల్బర్ట్ రోస్టీ

**గుంతకలు రైల్వే,అక్టోబరు 30,ప్రభాత వార్త:** ప్రపంచంలో దినదినాభివృద్ధి చెందుతున్న అత్యాధునిక యాంత్రిక,సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశం,స్విట్జర్లాండ్ దేశాలు పరస్పరం సహకరించుకుంటూ పెంపొందించుకునేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారత రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్,స్విట్జర్లాండ్ రవాణా శాఖ ఎక్సెలెన్సీ ఫెడరల్ కౌన్సిలర్ ఆల్బర్ట్ రోస్టీలు ఇరుదేశాల మధ్య సహృద్భావ వాతావరణంలో జరిగిన సమావేశంలో యాంత్రిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం సహకరించుకుంటూ సూత్రప్రాయంగా అంగీకరించి పెంపొందించడానికి జరిగిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా ఉభయ దేశాల రైల్వే ప్రతినిధుల మధ్య తమ సంపూర్ణ సహకారాలను సులభతరం చేయడానికి జాయింట్ వర్కింగ్ గ్రూప్(జెడబ్ల్యుజీ)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ సరుకు రవాణా,ప్రయాణికుల బోగీలు,రైల్వే విద్యుదీకరణ సామాగ్రి,రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ,సొరంగాల(టన్నెలింగ్) టెక్నాలజీ,రైలు మార్గాల నిర్వహణ,మేనేజ్‌మెంట్ నిర్మాణంతో పాటు వివిధ విభాగాలలో భారతీయ రైల్వేకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై భారతీయ రైల్వే అత్యంత ప్రాధాన్యతనిస్తుందని వక్కాణించారు. స్విట్జర్లాండ్ రవాణా శాఖ ఎక్సెలెన్సీ ఫెడరల్ కౌన్సిలర్ ఆల్బర్ట్ రోస్టీ మాట్లాడుతూ స్విట్జర్లాండ్ యొక్క ఆధునాతన రైల్వే సాంకేతికత రైల్వే సాంకేతికత భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందో విపులంగా వివరించారు. ఈ సమావేశంలో స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్,ఇరు దేశాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు. వెండైట్

# జ్వరాల వలయంలో ప్రజారోగ్యం!

ఎవరి గోల వారికి ఆనందం అంటారు. దేశంలో వివిధ వ్యాధులతో కోట్లాది మంది ప్రజలు విలవిల్లాడుతుంటే రాజకీయాల వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పైఎత్తులతో నేతలు మునిగి తేలుతున్నారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ, ఇతర విషజ్వరాలతోపాటు మలేరియా, డయేరియా, ఒకటేమిటి అన్ని రకాల వ్యాధులు ప్రజారోగ్యంపై దాడి చేస్తున్నాయి. విషజ్వరాల బారిన పడి ఎందరో అసువులు బాస్తుండగా, కోట్లాది మంది ఆస్పత్రిపాలవుతున్నారు. బహుశా తెలుగు రాష్ట్రాలతోసహా మరికొన్ని రాష్ట్రాల్లో ఇంతటి తీవ్ర పరిస్థితి గతంలో ఎదుర్కొన్న దాఖలాలు లేవని డాక్టర్లే చెబుతున్నారు. ఇంతటి పరిస్థితి ఉన్నా ప్రజల స్థితిని పట్టించుకునే తీరిక, ఓపిక పాలకులకు ఉన్నట్లు కన్పించడం లేదు. ఈ వ్యాధులతోపాటు కేన్సర్, ఎయిడ్స్, గుండె, కిడ్నీజబ్బులు కూడా ప్రబలిపోతున్నాయి. ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని కాకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు తలవంచుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో కొత్తమందులు కొనుగొన్నట్లు చెప్పుకుంటున్నా మానవుని మేధాశక్తిని సవాల్‌చేస్తూ ఎప్పటికప్పుడు కొత్త జబ్బులు వస్తూనే ఉన్నాయి. అవి ఎందుకు వస్తాయో,ఎలా వస్తాయో చెప్పలేని పరిస్థితి. సీజన్ మారినప్పుడల్లా విజృంభిస్తున్న దోమలు, వాటివల్ల ప్రబలే రోగాలు, మరణాలను కొందరు రాజకీయ నేతలు రాజకీయ వివాదాలకు వాడుకుంటున్నారే తప్ప పరిష్కరించే ప్రయత్నం జరగడం లేదనే చెప్పొచ్చు. ముఖ్యంగా కొన్ని వ్యాధులు సోకిన లక్ష్మీప్రసన్నుల సంగతి ఎలా ఉంచినా మధ్యతరగతి, రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు, చిన్నాచితక వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగించేవారి పరిస్థితి దారుణంగా ఉంది. కొత్త కొత్త వ్యాధులు వారిని గడగడలాడిస్తున్నాయి. ఒకటి,రెండు రోజులుకాదు.వారాల తరబడి నెలల తరబడి మంచం వదలలేకపోతున్నారు. ఇటీవల కనుమరుగవుతుందనుకున్న చికెన్‌గున్యా ఈసారి రెట్టింపుస్థాయిలో విస్తరిస్తున్నది. చికెన్‌గున్యా వ్యాధిసోకిన వారు అయితే ఒకటి, రెండు రోజులుకాదు వారాల తరబడి మంచాన్ని వదలలేకపోతున్నారు. కాలకృత్యాలు కూడా మరొకరి సహాయం లేకుండా తీర్చుకోలేకపోతున్నారు. గత రెండు,మూడేళ్లుగా ఈ వ్యాధి కొంత తగ్గినట్టు కన్పించినా ఈ యేడాది చాలా ప్రాంతాల్లో సోకినట్టు వార్తలు అందుతున్నాయి. వాస్తవంగా చికెన్ గున్యా ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందికాదు. మొదటిసారిగా 1953లోనే టాంజేనియాలో దీనిని కొనుగొన్నట్లు శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. 1955లో కోల్‌కత్తాలో కన్పించింది. తిరిగి 1962 ప్రాంతంలో కేరళ, తమిళనాడులో వ్యాపించిఅప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించింది. ఈడిసీ ఈజిప్ట్ అనే దోమకాటువల్ల వచ్చే ఈవ్యాధిని నియంత్రించలేకపోతున్నారు. ఇప్పుడు డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులు కూడా వీరవిహారం చేస్తున్నాయి. నగరాల్లో ఉన్న వారికి అంతో ఇంతో వైద్యం దొరుకుతున్నా దేశానికి పట్టుకొమ్మలైన గ్రామసీమల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పొచ్చు. అందరికీ వైద్యం అనేది స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లుదాటిపోయినా కనుచూపుమేరలో కన్పించడంలేదు. ఇప్పటికీ భారత్‌లో దాదాపు నలభైయేడు కోట్ల మందికి అత్యవసర మందులు అందుబాటులో లేవని అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా దేశంలో పేదలు,దిగువ మధ్యతరగతి ప్రజలు పెట్టే ఖర్చులో దాదాపు డెబ్బైశాతంపైగా మందుల కొనుగోళ్లలోఖర్చు చేస్తున్నారు.నకిలీ,నాసిరకం మందులు ప్రజల ఆరోగ్యాన్ని పతనం అంచునకు తీసుకుపోతున్నాయి. ప్రభుత్వరంగంలో వైద్యం అందని ద్రాక్షపండుగా తయారైంది. పెద్దపెద్ద రోగాల సంగతి అటుంచి చిన్న చిన్న వ్యాధులకు కూడా సూదిమందు, మందుబిళ్లలు దొరకడం గగనమైపోతున్నది. అసలు నిబంధనల ప్రకారం మౌలిక వసతులు ప్రజారోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల్లో పాలకులకు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. మొన్న కరోనా విజృంభణ సమయంలో మౌలిక వసతుల పరిస్థితి ఎలాఉందో బయటపడింది.చివరకు ప్రాణవాయువు అందించలేకపోవడంతో ఎందరోఅమాయకులప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇటు కనీస మౌలిక వసతులు లేకపోవడం, మారుమూల ప్రాంతాలకు సిబ్బందిని పంపలేకపోవడంతో పరిస్థితి చేయిజారుతున్నది.కొన్నిపిఎస్‌ఇలు యేళ్లతరబడి డాక్టర్లు లేకుండానే నడుస్తున్నాయి. గ్రామీణ ప్రజలను అల్లాడిస్తున్న విషజ్వరాల సమాచారాన్ని సేకరించేవారే కరవయ్యారు.గతంలో గ్రామీణప్రాంతంలో ఇంటింటికి వెళ్లి వారికి సోకుతున్న వ్యాధుల గురించి వివరాలు సేకరించి కొన్ని మందులు కూడా ఇచ్చేవారు.ప్రస్తుతం ఆ కార్యక్రమం జరుగుతున్నట్టు కన్పించదు. సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవం.కానీ ఉన్న సిబ్బంది కూడా గ్రామాలకువెళ్లే పరిస్థితుల్లో లేరు. చాలావరకు పట్టణాలకు పరిమితమై అప్పుడప్పుడు గ్రామాలకు వెళ్లివస్తున్నారు. అందువల్ల వ్యాధుల తీవ్రత గురించి ప్రభుత్వానికి సమగ్రమైన సమాచారం లేకుండాపోతున్నది. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. రోగులకు చికిత్స అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి. ఈ రోగాలకు మూలకారణలైన పారిశుధ్యం, మురుగునీరు,తదితరఅంశాల్లో ఒకనిర్దిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపట్టాలి.ప్రజారోగ్య సంరక్షణబాధ్యత ప్రభుత్వంపై మాత్రమే వదలకుండా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలి.

అనుభవించడం కంటే, అనుభవం కోసం ఎదురు చూడటంలోనే మనిషి జీవితం ఎక్కువ కాలం గడిచిపోతుంది.



వోల్టేర్

జీవితంలో ప్రతి నిముషాన్నీ వ్యర్థంచేయక ఉపయోగించుకో! లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

## ప్రజావాక్కు



### రాజకీయాల్లో పెరుగుతున్న సినీనటులు

తమిళనాట రాజకీయాలు మొదటి నుంచి సినీ పరిశ్రమతో ముడిపడ్డాయి. సినీనటులు, రచయితలు ముఖ్యమంత్రులయ్యారు. కాని తరువాతితరం నటులైన విజయకాంత్,కమలాహాసన్ రాజకీయ పార్టీలను పెట్టి నిలదొక్కుకోలేకపోయారు.సూపర్‌స్టార్‌గా వెలిగిపోతున్నరజనీకాంత్ కూడా ఓ పార్టీని స్థాపించి విరమించుకున్నాడు. విజయ్ అనే తమిళ నటుడు ఈ మధ్య కొన్ని సినిమాల్లో నటించి అవి సూపర్ డూపర్ హిట్లు కావడంతో తమిళనాట సూపర్‌స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు. కోట్లాది అభిమానులను సంపాదించుకున్నాడు. వీరందరూ తన ఓటు బ్యాంకుగా భావించి సినిమాలు మానేసి ఓ కొత్త ప్రాంతీయ పార్టీని నెలకొల్పాడు. సినిమా అభిమానులు వేరు ఓటర్లు వేరనే విషయం విజయన్‌కు తెలియని సంగతి కాకపోవచ్చు.

-ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### చర్చలతోనే సమస్యలకు పరిష్కారం

భారత్, చైనా మధ్య సరిహద్దు సమస్య చర్చల ద్వారా పరిష్కారం కావడంతో చర్చల ద్వారా ఎంతటి క్లిష్టమైన సమస్యఅయిన పరిష్కరించే అవకాశం ఉందని చాటినట్టు అయింది.దక్షిణచైనా సముద్రం,హిందూ మహాసముద్రం పైన ఆధిపత్యం వహించాలి అనే ధోరణికి చెక్ పెట్టినట్టు అయింది.వివిధ సెక్టర్లలో చెలరేగిన అశాంతియుత పరిస్థితికి చరమగీతం పెట్టినట్టుఅయింది.చారిత్రకంగా చూసినా 1964 నాటి పంచశీలా ఒప్పందం నాటి స్ఫూర్తి కొనసాగించినట్టు అయింది. మారణహోమం లేదా హక్కుల హననం గురించి విస్తృత విశాల చర్చ ఒకటి జరిగింది.

-భారత అవినాష్, జనగామ

### డిజిటల్ అరెస్టులు

ప్రస్తుత అంతర్జాల యుగంలో డిజిటల్ అరెస్టుల లాంటి సైబర్ మోసాలుఅధికమయ్యాయి.తాజాగా కేంద్రప్రభుత్వం సైబర్ మోసాల బారిన పడకుండా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదే సందర్భంగా ప్రధాని మోడీ తన తాజా 'మన్ కీ బాత్'లో సైబర్ మోసాల బారిన పడకుండాతీసుకోవాల్సి నజాగ్రత్తలను వివరించడం జరిగింది. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా పౌర సమాజం స్వీయ విచక్షణతో సైబర్ మోసాలను ఎదుర్కోవాలి .

-ఎం.ముత్యంరెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

### విద్యార్థులకు 'అపార్' కష్టాలు

కేంద్రం నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా వన్ నేషన్ వన్ స్టూడెంట్ అనే నినాదంతో ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్య అందించేందుకు శ్రీకారంచుట్టింది.ఇందు కొరకు ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. ఈనమోదుకు తప్పులు తడకగా ఉన్న ఆధార్‌వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. విద్యార్థి ఇంటి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు,స్పెల్లింగ్ దోషాలు అధికంగా ఉంటున్నాయి. 50 శాతానికిపైగా విద్యార్థులలో ఈ దోషాలు ఉన్నాయి. ముందుగా ఆధార్ సరి చేసుకుంటేనే అపార్‌నమోదు సాధ్యమని ప్రధానోపాధ్యాయులు తెలపడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల వద్ద పడికాపులు కాస్తున్నారు.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి,నెల్లూరుజిల్లా

### పిఎం కిసాన్ నిబంధనలు సవరించాలి

ప్రధానమంత్రి కిసాన్‌సమ్మాన్ నిధి పథకం ప్రారంభించినప్పటి పాత మార్గదర్శకాలనే ఇప్పటికీ కొనసాగించడం కారణంగా లక్షలాది మంది రైతులకు కేంద్రప్రభుత్వ సాయం అందడం లేదు. దేశవ్యాప్తంగా ఐదెకరాలలోపు సాగు భూమి ఉన్న రైతులకు కేంద్రం పిఎంకిసాన్ స్కీం ప్రవేశపెట్టింది. ఈ పథకం కిందయేటా రూ.ఆరువేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2018 డిసెంబరు నుంచి 2019 ఫిబ్రవరి1 మధ్య భూమిఎవరి పేరుతో ఉంటే వారే పిఎంకిసాన్ పథకానికి అర్హులని కేంద్ర మార్గదర్శకాల్లో పేర్కొంది. భూ యజమాని మరణిస్తే వారసులకు భూమి సంక్రమించడం అలాగే ఇతర రైతులు భూమి కొనుగోలు చేయడం చాలా వరకు భూ బదలాయింపులు జరుగుతున్నాయి. పిఎంకిసాన్ పథకంలో ప్రస్తుతం అమలుచేస్తున్న నిబంధనలను సవరించాలి.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

### ఎస్‌జిటిలకు ఓటు హక్కు కల్పించాలి

ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలలో ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఎనభై శాతం మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు, స్కూల్ అసిస్టెంట్లకు ఓటు హక్కు లేకపోవడం అప్రజాస్వామికం, విచారకరం. ఉన్నత విద్యార్హతలు ఉండి కనీసం ఓటు హక్కు లేకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. 1950లో చేసిన చట్టాన్ని సవరించి సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటు హక్కు కల్పించాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్, భూపాలపల్లిజిల్లా

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# రాజ్యాధికారం వైపు బిసిల అడుగులు

***ప్రలోభాలకు లొంగి కులాలవారీగా చీలిపోకుండా తామంతా ఒకే జాతి అనే విషయం గ్రహించి యావత్తు బిసి సమాజం ఒకటిగా నడచి యువతను ఎక్కువగా భాగ స్వాములుగా చేస్తే తాము అనుకున్న రాజ్యాధికారం అనే లక్ష్యం సాధించేందుకు బిసిలకు సులభమౌతుంది. పార్టీపెట్టిన వెంటనే సత్ఫలితాలు రాకపోవచ్చు. అనేక ఒడిదుడుకుల అనంతరం కచ్చితంగా బిసిలు రాజ్యాధికారం సంపాదించే అవకాశం అత్యధికంగా ఉంది. తెలంగాణా రాష్ట్రంలో రాజ్యాధికారం వైపు బిసిలు వేసే అడుగులు దేశంలోని బిసిలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని కచ్చితంగా చెప్పవచ్చు. విత్తనం వేస్తేనేకదా మహావృక్షమై పదిమందికి నీడనిచ్చేది.***

కైలాసాని శివప్రసాద్

తెలుగు రాష్ట్రాలు రెండూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా కలసి ఉన్నప్పటినుంచి అనేక సంవత్సరాలుగా బిసిలు రాజకీయపార్టీ పెడతారని బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు ఆ వార్తలు కార్యరూపం దాల్చకపోవటం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడిపోయి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక బిసిలు రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నారనే వార్తలు విస్తృతంగా ప్రజలలోకి వెళ్లాయి. అయినా ఇప్పటివరకు బిసిల రాజకీయ పార్టీ ఏర్పాటుకు ఏ ఒక్క నాయకుడు నడుంబిగించిన దాఖలాలు లేవు. వాస్తవంగా తెలంగాణా రాష్ట్రంలో బిసిలుచాలా బలీయమైన శక్తిగా ఉన్నారనేది నిర్వివాదాంశం. రాష్ట్ర శాసన సభకు ఇటీవల జరిగిన ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిసిని ప్రకటించటం, కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ ప్రకటించటం, ఇటీవల కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షునిగా బిసి అభ్యర్థిని నియమించటం రాష్ట్రంలోబిసిలు బలంగా ఉన్నారనేదానికి నిదర్శనం. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులలో 139కులాలున్నాయి. అంతకు రెట్టింపు స్థాయిలో ఆ కులాలకు సంఘాలు ఉండటం గమనార్హం. ఈ పరిణామం ఆహ్వానించదగినదే అయినా, ఆ కులసంఘ నాయకుల మధ్య ఐకమత్యం లేకపోవటం రాష్ట్రంలో బిసిల పార్టీ ఆవిర్భావానికి అవరోధంగా కనిపిస్తూఉంది.తెలంగాణా రాష్ట్రంలో సుమారు 58శాతం బిసిలున్నారు. రాష్ట్రంలోని బిసిలలో ఉన్న పోరాట పటిమ దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేదనేచెప్పాలి. తమ హక్కుల సాధన కొరకు తెలంగాణాలోని బిసిలు చేసే ఉద్యమాలు దేశానికి ఆదర్శమనటంలో ఎటువంటి సందేహంలేదు. బిసి కులాల జనగణన చేయటంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంటే ఈ విషయంపై బిసి సంఘ నాయకులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధించారు. మూడు నెలల్లోపు బిసిల జనగణన పూర్తిచేయమని రాష్ట్ర హైకోర్ట్ రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. బిసిల జనాభా అధికారికంగా లెక్కించటం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి సహేతుకంగా కనిపించింది. కాని బిసిల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసి జనాభా లెక్కించటం సమంజసంగా కనిపించకపోవటం ఆశ్చర్యకరం. తెలంగాణా రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 9 తేదీన కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ప్రకటించింది. ఆ బిసి డిక్లరేషన్ పట్ల ఆకర్షితులైన అత్యధిక శాతం బిసిలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారు. పర్యవసానంగా రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది.అప్పటి టిపిసిసి అధ్యక్షులు, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మాణిక్ రావ్ ఠాకూర్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతల సమక్షంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బిసి డిక్లరేషన్‌ను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు స్థానికసంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించటం వంటి అనేక హామీలు ఆ బిసి డిక్లరేషన్లో పొందుపరిచారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు గడుస్తున్నా బిసి డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న ఆలోచన ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి తట్టలేదు. తమ ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్‌ను అటకెక్కిస్తుందని భావించిన బిసి కుల సంఘాలన్నీ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కాయి. బిసి కులగణన, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు, బిసి డిక్లరేషన్ అమలు చేయమని రాష్ట్రంలోని బిసిసంఘాలు అన్నీ ఉద్యమ బాటపట్టాయి. కొందరు బిసి నాయకులు ఏకంగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవటం గమనార్హం. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలకు, బిసి సంఘాల ఉద్యమ తీవ్రతకు తలొగ్గిన రాష్ట్రప్రభుత్వం రెండు నెలల్లోపు రాష్ట్రంలోసంపూర్ణ కులగణన చేయాలని నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో కులగణన తర్వాతనే రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు




జరుపుతామని, బిసిల రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేసేందుకే రాష్ట్రంలో కులగణన చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ పరిణామం కచ్చితంగా రాష్ట్రంలోని బిసిలు సాధించిన విజయమనటంలోఎటువంటి సందేహం లేదు. రాష్ట్రంలోని బిసి సంఘనాయకుల ఉద్యమ స్ఫూర్తిని కూడా ఈ సందర్భంగా కచ్చితంగా అభినందించాలి. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని బిసి సంఘాలు, నాయకులు ఒకే వేదికపైకి వస్తే బిసిల రాజకీయ పార్టీ ఆవిర్భావాన్ని, అధికారంలోకి రావటాన్ని ఏశక్తీ అడ్డుకోలేదు. బిసి సంఘా లు విడిగా ఎవరికి తోచినరీతిలో వారు ఉద్యమాలు చేస్తు న్నంత కాలం రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వచ్చే ఓటర్లుగానే బిసిలు మిగిలిపోతారు. బిసిల సమస్యలు ఎప్పటికీ తీరవు. ఎంతోకాలం నుంచి రాజ్యాధికారం కొరకు బిసిలు కంటున్న కలలు కలలుగానే మిగిలిపోతాయని కచ్చితంగా చెప్పవచ్చు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అత్యధికంగా నష్టపోయిందిరెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా 56 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతుల వారే అనటంలో ఎటువంటి సందేహం లేదు. దేశంలోని బిసిల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోయి అన్నిరంగాలలో వెనుకబడిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం దేశంలో ఉన్న రాజకీయ పార్టీల కుటిలబుద్ధే అని కచ్చితంగా చెప్పవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 43 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అనుభవించింది.ఆ సమయంలో ఒక్క బిసి వ్యక్తిని కూడా ముఖ్యమంత్రి స్థానంపై కాంగ్రెస్ పార్టీ కూర్చోబెట్టలేదు. ప్రస్తుతం కూడా తెలంగాణా రాష్ట్రం లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ముఖ్యమంత్రి పీఠం కట్టబెట్టింది. అదే విధంగా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించింది. ఆ సమయంలో బిసిలు, బిసిల సమస్యలు కాంగ్రెస్ పార్టీకి గుర్తుకురాకపోవటం శోచనీయం. అదేవిధంగా ఇటీవల తెలంగాణా రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ తరపున బిసిని ముఖ్యమంత్రి చేస్తామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. అదే బిజెపి కేంద్ర పరిధిలోని బిసి కులగణన, బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించటం వంటి అనేకబిసిలకు సంబంధించిన విషయాలను గాలికి వదిలేసింది. బిసిల సమస్యలు పరిష్కరించకుండా బిసిలు ఈ పార్టీలను ఎందుకు నమ్ముతారు? వ్యక్తిగత పార్టీలైన ప్రాంతీయ పార్టీలకు బిసిల అభివృద్ధి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటుందో ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవచ్చు. దేశంలో సగానికిపైగా ఉన్న బిసిల కులగణన చేయాలంటే దేశంలోని ప్రాంతీయ, రాజకీయ పార్టీలకు భయం. చిత్తశుద్ధితో శాశ్వత పథకాలు అమలుచేసి బిసిలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తే దేశం యావత్తు పాలనా పగ్గాలు వారి చేతులలోకి పోతాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.ఈ విషయాన్ని స్పష్టంగాగ్రహించి రాజకీయ పార్టీలు గత ఏడు దశాబ్దాలుగా తమకు న్యాయం చేయటం లేదని భావించి రాజ్యాధికారంలో తమ జనాభాకు తగిన ప్రాతినిధ్యాన్ని సంపాదించుకొని తమ జాతుల జీవితాలు బాగు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో బిసిలు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తున్నారు. కాని బిసిలను రాజ్యాధికారం వైపు నడిపించే నాయకత్వం మాత్రం కనిపించటం లేదు. దీనికిదశాబ్దాల తరబడి తమ జాతుల హక్కుల కొరకు ఉద్యమాలు చేస్తున్న నాయకులు,ఉన్నతస్థానాలలో రిటైర్ అయిన ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగులు, విద్యాధికులు, మేధావులు ఎటువంటి భేషజాలకు పోకుండా పంతాలు, పట్టింపులకు పోకుండా, ఒకే వేదికపైకి వచ్చి మొత్తం సంఘాలను, నాయకులను, ప్రజలను ఒకే తాటిపై నడిచేటట్లు చర్యలు తీసుకుని రాజకీయపార్టీ స్థాపించి బిసి జనానికి రాజ్యాధి కార బాటచూపించవలసిన ఆవశ్యకత ప్రస్తుతం అధికంగా ఉంది. ప్రలోభాలకు లొంగి కులాలవారీగా చీలిపోకుండా తామంతా ఒకే జాతి అనే విషయం గ్రహించి యావత్తు బిసి సమాజం ఒకటిగా నడచి యువతను ఎక్కువగా భాగ స్వాములుగా చేస్తే తాము అనుకున్న రాజ్యాధికారం అనే లక్ష్యం సాధించేందుకు బిసిలకు సులభమౌతుంది.పార్టీపెట్టిన వెంటనే సత్ఫలితాలు రాకపోవచ్చు.అనేక ఒడిదుడుకుల అనంతరం కచ్చితంగా బిసిలు రాజ్యాధికారం సంపాదించే అవకాశం అత్యధికంగా ఉంది. తెలంగాణా రాష్ట్రంలో రాజ్యా ధికారం వైపు బిసిలు వేసే అడుగులు దేశంలోని బిసిలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని కచ్చితంగా చెప్పవచ్చు. విత్తనం వేస్తేనేకదా మహావృక్షమై పదిమందికి నీడనిచ్చేది.

# భద్రతా మండలిలో భారత్ చేరితేనే బలం

కనుమ ఎల్లారెడ్డి

ఐక్యరాజ్య సమితి పేరుచాలా బలంగా ఉంది. కాని రాజ్యాలే ఐక్యంగా లేవు. దాడులు ప్రతిదాడులతోవిశ్వం భయకంపితమవుతూ ఉంది. పశ్చిమాసియాలో విధ్వంసకాండ పెచ్చరిల్లుతోంది. ఒకపక్క రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఎప్పుడు ఆగుతుందో చెప్పలేం. మరి యుద్ధాలను నివారించే ఐక్యరాజ్య సమితి మాటలు ఆయా దేశాలు పెడచెవిన పెడుతున్నాయి. సమితిబలంగా లేనట్లు కనపడుతూ ఉంది. అయితే భద్రతా మండలిలో బలమైన దేశాలే శాశ్వత సభ్య దేశాలుగా ఉన్నాయి. మరోదేశం చేరికపై అవి అంతగాఆసక్తి కనపరచడం లేదు. సమితి ఏర్పడినప్పటి నుంచి అమెరికా, రష్యా, బ్రిటన్,ఫ్రాన్స్, చైనా దేశాలే శాశ్వత హోదా స్థాయిలో ఉన్నాయి. భారత్ చేరికకు అన్ని హంగులున్నా కొన్ని రాజకీయ కారణాలతో ఆ ప్రతిపాదన అమలుకు నోచుకోవడం లేదు. శాశ్వత సభ్య దేశాలలో చైనా మాట మాత్రం కూడా భారత్ పేరుఎత్తుడంలేదు. మిగిలిన దేశాలలో రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు సుముఖంగా ఉన్నా అగ్రదేశం అమెరికా ఆంతర్యం బయటపడటం లేదు. ఒకవేళ అమెరికా చెప్పినా, అది ఇరువురు నాయకులు కలిసినప్పుడు మాత్ర మే భద్రతా మండలిలో మీకు అవకాశం అనే కంటితుడుపు మాటలతో భారత్‌ను ఊరిస్తూ ఉంటుంది. వాస్తవానికి భారత్, భద్రతా మండలిలో చేరడం చైనాకు సుతరాము లేదు. రష్యా, ఫ్రాన్స్ మాత్రం భారత్ చేరితే బలం చేకూరుతుందని చెప్పినా అది ఆచరణకు నోచుకోవడం లేదు. బ్రిటన్ కూడా భారత్ చేరితే సంతోషం వ్యక్తం చేస్తుంది. అయితే అది అమెరికా ఎలాచెబితే అలా నడుచుకుంటుంది. చైనా ఒక్కటే అడ్డంకి. అది భారత్ చేరికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోదు. వీటోపవర్ ఉండడమే కారణం. అయితే అమెరికా నచ్చచెబితే చైనా వెనక్కి తగ్గవచ్చు. కాని చైనా, రష్యా, ఇప్పుడు కొత్త మిత్రత్వంతో ఉన్నాయి. భారత్‌కు, రష్యా అనుకూలమైన చైనా,రష్యా అంటే అమెరికాకు పొసగడం లేదు. పైకి చైనాతో మా సంబంధాలు బాగానే ఉన్నాయి అనిచెప్పినా రష్యాకు అమెరికా అంటేగిట్టదు.ఎందుకంటే ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇవ్వడం, యుద్ధం ఆగకపోవడం కారణం అమెరికానే అనే తలంపుతో రష్యాఉంది. ఇటువంటి తరుణంలో భద్రతా మండలిలో భారత్ చేరిక ఎంతో అవసరం. అందరికీ మిత్రదేశంగా భారత్ తన పాత్రను పోషిస్తుంది. అయితే చైనా ఎంతవరకు భారత్‌ను అంగీకరిస్తుందో చెప్పలేని స్థితి. భారత్ భద్రతా మండలిలో చేరితేనే దానికి అదనపు బలం. ఎందుకంటే భారత్ శాంతికి ప్రాముఖ్యత ఇచ్చే దేశాలలో ముందు ఉంటుంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆగాలి అంటే భారతే చొరవ తీసుకోవాలి. ఇక ఏ దేశంతోను సాధ్యంకాదు. కనుక ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఆరోవ దేశంగా భారత్‌చేరికను శాశ్వత సభ్య దేశాలు ఒప్పుకోవాలి.అందుకు అమెరికా ముమ్మరప్రయత్నం చేయాలి. కొన్ని దేశాలు అడ్డుపుల్లవేసినా అమెరికా ఆమోదం తెలిపితే భారత్ చేరిక సాధ్యం అవుతుంది. అయితే చైనా ఎంతవరకు సహకరిస్తుందో అనే సంశయం వ్యక్తమవుతోం ది. ఏదిఏమైనా శాశ్వత సభ్య దేశాలు రాజకీయాలు పక్కన పెట్టి సమితిలో సంస్కరణలు చేపట్టాలి.ఇందులో ముందుగా చైనా ముందుకు రావాలి.చైనా ముందుకువస్తే రష్యా సహకరిస్తుంది.అంతేకాని కొన్ని శిఖరాగ్ర సమావేశాలలో భారత్‌కు స్థానంకల్పించాలి అని బాకా ఊదితేచాలదు. అందుకు తీవ్ర ప్రయత్నాలుచేయాలి. ఇటీవల బ్రిక్స్‌సమావేశంలోమండలిలో భారత్‌కుస్థానం అనేమాట వినిపించింది. కేవలం మాటేకాక ఆ దిశలో చర్యలుచేపట్టాలి. విశ్వం శాంతిగా ఉండాలంటే భారత్ మండలిలో చేరితేనే ఇక యుద్ధాలమాటలు వినపడవు.ఎందుకంటే భారత్ శాంతికాముక దేశం కనుక. ఏతావాతా అగ్రదేశంశాసిస్తే భారత్‌కుప్రవేశం సులువుఅవుతుంది. భారత్ ప్రవేశానికి రాజకీయాలు అడ్డు ఉండకూడదు. ఇటీవల బ్రిక్స్‌దేశాలు కూడా కొత్తదేశాల చేరికకు ఆమోదం తెలిపాయి.అలాగే భద్రతామండలిలో కూడావిస్తరణచేపట్టాలి.

# ప్రాణికోటి ఆయువు తగ్గిస్తున్న విషవాయువు



డా.చిట్యాల రవీందర్

ఇటీవలి కాలంలో ఢిల్లీలోవాయు కాలుష్యం మరింత తీవ్రమైందని వార్తలు వెలువడుతున్నాయి.దేశ రాజధాని అనేక సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాయు కాలుష్యం ఇప్పట్లో తగ్గే సూచనలేవీ కనిపించడంలేదు.ప్రజల ఆరోగ్యం పాలవుతుండడంతోపాటు, సాధారణ జీవన విధానంలోనూ తీవ్రమైన ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పక్క దేశమైన పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం ప్రపంచవ్యాప్తంగా అత్యంత చెడ్డైన వాతావరణ నాణ్యత సూచీతో వార్తల్లో నిలిచింది. ప్రధానంగా శీతాకాలంలో ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడం పరిపాటిగా మారింది. వాయువుల కాలుష్యానికి ప్రధాన కారణాలుగా పరిశ్రమల వ్యర్థాలు, ట్రాఫిక్ వ్యర్థాలు, పొగాకులు, పంట వ్యర్థాల దహనం, బిల్డింగ్ నిర్మాణం వంటి ఎన్నోఅంశాలు పేర్కొనవచ్చు. దీని వలన వాతావరణంలో విష వాయువులు, ప్రధానంగా కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, వంటి కణాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ విషవాయువుల ప్రభావం మన శరీరంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతుంది. శ్వాసకోశ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలకు ఇది కారణమవుతోంది. ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్న కలిగిన నగరాల జాబితాలో ప్రస్తుతం లాహోర్ ముందు వరుసలో ఉంది. అక్కడి సాధారణ స్థాయి కంటే చాలా ఎక్కువగా ఉండటం వలన ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. 500 కంటే ఎక్కువ స్థాయి ఉండటం దీని తీవ్రతను తెలిపే సూచిక. లాహోర్‌లోని కాలుష్య కారణాలుగా పరిశ్రమలు, రహదారి గందరగోళాలు, పంటవ్యర్థాల కాల్చివేత వంటివి ప్రధానమైనవి. భారత దేశంలో ఢిల్లీ వంటి నగరాల వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నా, అవి సక్రమంగా అమలులోకి రాకపోవడం ఒక పెద్దసమస్యగా నిలిచింది. రైతులు పంట వ్యర్థాల దహనం తగ్గించడం, పంట వ్యర్థాలను కాల్చివేయకుండా వాటిని పునర్వినియోగపరచుకునే మార్గాలను ఆవిష్కరించడంపై దృష్టిపెట్టాలి. వాహనాలలో పరిశ్రమల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పునర్వినియోగ ఇంధనాల వినియోగంపై దృష్టిపెట్టడం ముఖ్యం.



పచ్చదనాన్ని పెంచడం ద్వారా వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చు. వాయుకాలుష్యం ఒక్క ఢిల్లీనే కాదు, ప్రపంచంలోని అనేక మహానగరాలకు చెందిన సమస్యగాఉంది. ప్రత్యేకించి భారతదేశం, పాకిస్థాన్ వంటి దేశాలలో ఇది మరింత తీవ్రమవుతోంది. ఎక్యూఐ అధ్వాన్నం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ తరుణంలో మనం చేపట్టాల్సిన చర్యలు తక్షణమే అవసరం. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం వాయు నాణ్యత విషయానికివస్తే రెండు రాష్ట్రాల్లో వేర్వేరు ప్రాంతాల్లో వాయు నాణ్యత స్థాయిలు భిన్నంగా ఉన్నాయి. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో, వాయు నాణ్యతా సూచీ 71-99 మధ్యలో ఉంది.ఇది సాధారణంగా 'మధ్యస్థ' స్థాయిలో ఉంటుంది. ఇది ప్రజలు బయటకు వెళ్లే సమయంలో కొద్దిగా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.ఆంధ్రప్రదేశ్‌లో, కొన్ని పట్టణాల్లో పరిస్థితి కాస్త అధ్వాన్నంగా ఉంది. ఉదాహరణకు తుని, విజయనగరం, తెనాలి, వంటి ప్రాంతాల్లో ఎక్యూఐ పూర్వకస్థాయిలోఉంది. ఈ స్థాయిలో వాయుకాలుష్యం ఎక్కువగా ఉండటంతోకొంత మంది ప్రజలకు ఆరోగ్య సమస్యలు కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్వాససంబంధిత సమస్యలు ఉన్నవారికి. అందువల్ల తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వాయు నాణ్యత సాధారణ స్థాయికి కంటే దిగువన ఉంది. కాబట్టి వాయు కాలుష్యాన్ని నివారించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ముఖ్యంగా పిఎం2.5 స్థాయిలు ఎక్కువగా ఉండే సమయంలో, దీపావళి సమయంలో భారతదేశంలో వాయు నాణ్యతా సూచీ సాధారణంగా అధ్వాన్న స్థాయిలకు చేరే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.దీపావళి సందర్భంగా ఉపయోగించే పటాకుల వలన అధికస్థాయిలో వాయు కాలుష్యం జరుగుతుంది. ముఖ్యంగా పిఎం2.5, పిఎం10 పార్టికల్స్ విపరీతంగా పెరుగుతాయి. పటాకులు కాల్చడం వలన వాయుకాలుష్యం సాధారణ స్థాయి కంటే ఎక్కువగా ఉండి 'పూర్వక'లేదా 'తీవ్రమైన' స్థాయికి చేరే అవకాశం ఉంది. ఇందులోప్రధానంగా భారీనగరాలు,ముఖ్యంగా ఢిల్లీ,ముంబై, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో పరిస్థితి అత్యంత గణనీయంగా ఉంటుంది. ఢిల్లీలో గత సంవత్సరాల్లో దీపావళి సమయంలో ఎక్యూఐ అత్యధికంగా 'తీవ్ర కాలుష్యం' స్థాయికి చేరిందని నివేదికలు సూచిస్తున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు జాగ్రత్త వహించాలి. దీపావళి సమయంలో ప్రభుత్వాలు తరచూ కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాయి. అయితే పటాకుల వాడకాన్ని తగ్గించడంలేదా సాంకేతికంగా తక్కువ కాలుష్యం కలిగే పటాకులను వినియోగించడం వంటి చర్యలు తీసుకోవాలి. అందువల్ల దీపావళి సమయంలో వాయు నాణ్యత పతనం అవడం సాధారణం. ముఖ్యంగా పెద్ద నగరాల్లోని ప్రజల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

## చదువుల తల్లికి అండగా మంత్రి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** ఎంబిబిఎస్ సీటొచ్చినా కూలీ పనులకు వెళ్తున్న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ గ్రామానికి చెందిన కాట్రోజు సుమలత ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకొని చలించిపోయారు ఆర్ అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. సుమలతను తండ్రి శివ రామ్‌లను తన నివాసంకు బుధవారం పిలిపించుకొని బట్టలు ,పుస్తకాలు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ నుంచి ఇప్పించారు. ఎంబిబిఎస్ విద్యార్థిని సుమలత, తండ్రి శివరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భావోద్వేగానికి గురైనారు. మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి కాలేజీ యాజమాన్యంతో మాట్లాడినారని ఆమె తెలిపారు. తండ్రి శివరాం మాట్లాడుతూ మా పాప సుమలత చదువుకు భరోసా దొరికిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్(కుత్బుల్లాపూర్), అక్టోబరు 30 ప్రభాత వార్త:** జీడిమెట్ల పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న ఓ కార్మికుడు అనుమానస్పద స్థితిలో ఇంట్లో చీరకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పరిధిలోని టిఎస్ఐఐసి కాలనీలో చోటుచేసుకుంది. రత్న కంపెనీలో హెచ్ ఆర్‌గా పని చేస్తున్న రాజశేఖర్(31) ఒక అమ్మాయిని ఇష్టపడుతున్నట్లు తెలిసింది. తీరా సదరు అమ్మాయి రాజశేఖర్‌ను తిరస్కరించడంతో ఇంట్లో ఎవరూ లేనిసయం చూసి ఇంటిపైకప్పు హుక్‌కు గ్రీన్‌కలర్ చీరను తగిలించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ అనే స్నేహితుడు మాట్లాడేందుకు రాజశేఖర్ ఇంటికి రాగా ఇంటి తలుపు తీసి వుంది. లోపలికి వెళ్లిచూడగా అప్పటికే చీరతో ఇంట్లో ఉరివేసుకుని చనిపోయినట్లు గుర్తించాడు. వెంటనే రాజశేఖర్ తండ్రి కుమారస్వామికి తెలపడంతో వారు ఇంటికివచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము జనగాం జిల్లా నుండి నాలుగేళ్లక్రితమే నగర శివారు టిఎస్ఐఐసి కాలనీలో నివాసముంటూ ధర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తు జీవనం సాగిస్తున్నట్లు చిట్టిబాబు తెలిపారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు ఇందిరమ్మ వర్ధంతి, నెక్లెస్ రోడ్డులో నివాళులు

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళ్ళు అర్పిస్తారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో సీనియర్ నాయ కులు ఉదయం 10:30కు గాంధీభవన్‌లో చిత్రపటంకు పూల మాల వేసి వర్ధంతిని జరుపుతారు. అంతకు ముందు నెక్లెస్ రోడ్‌లోని మాజీ ప్రధాని ఇంది రాగాంధీకి నివాళులు అర్పిస్తారు.

## మంత్రి సురేఖపై పరువు నష్టం కేసు విచారణ వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** మంత్రి కొండా సురేఖపై బిఆర్ఎస్ నాయకుడు కెటిఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసు విచారణ నాం పల్లి కోర్టులో మరోసారి వాయిదా పడింది. దీనికి సంబంధించి బుధవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఇంతకు ముందు జరిగిన విచారణలో దాసోజు శ్రవణ్ వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేయగా తాజా విచారణలో మరో ముగ్గురి వాంగ్మూలాన్ని నమోదు చేసింది.

దీనిపై తదుపరి విచారణను కోర్టు నవంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది.

## ఇద్దరు ఐఎఎస్ అధికారులు, మాజీ సిఎస్‌పై ఇడికి ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** ఐఎఎస్ అధికారులు నవీన్ మిత్తల్, అమోయ్ కుమార్‌లతో పాటు విశ్రాంత చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)కి ఫిర్యాదు అందింది. నకిలీ పత్రాలతో తమ భూమిని బదిలీ చేశారని సురేష్, వేదే రాఘవయ్య అనే వ్యక్తులు ఈడీకి ఫిర్యా దు చేశారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో గల 42 ఎకరాల భూమి వాస్త వానికి తమది కాగా ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి నవీన్ మిత్తల్, అమోయ్ కుమార్‌లతో పాటు విశ్రాంత చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌లు ఇతరు లకు అక్రమంగా బదలీ చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డిజిల్లా నాగారంలో గల భూదాన్ భూముల బదలాయింపుతో పాటు వట్టినాగులపల్లిలోగల భూముల బదలాయింపు విషయంలో ఈడీ అధికారులు ఇప్పటికే అమోయ్ కుమార్‌ను మూడురోజులపాటు విచారించడం తెలిసిందే.

## రుణమాఫీ కాని రైతులు వనపర్తి ఎమ్మెల్యే ఆఫీసుకు రండి

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూధన్‌రెడ్డిలు

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** రుణమాఫీ కానీ రైతులు వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకురావాలని ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూధన్‌రెడ్డిలు కోరారు. గాంధీభవన్‌లో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ వనపర్తిలో కొందరికి పనిలేక ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రైతుల మీద ప్రేమ ఉన్నట్లు హరీష్‌రావు మాట్లాడినారని మధుసూధన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దోపిడిచేసి రుణమాఫీ విషయంలో హరీష్‌రావు తప్పుడు ఆరోపణలు చేశారని ఆయన అన్నారు. టిడిపి కాంగ్రెస్ వనపర్తికి ఏం చేయలేదని అంటున్నారని రెండుసార్లు గెలిచిన చంద్రశేఖర్‌రెడ్డి ఎంచేశారో చెప్పాలని హరీష్‌రావును తూటి మేఘారెడ్డి ప్రశ్నించారు. 27400కోట్లు ఖర్చు చేసి పాలమూరు రంగారెడ్డి 90శాతం పూర్తిచేశామని అంటున్నారని అదేనిజమైతే 10శాతం నిధులు ఇస్తాం పూర్తిచేయగలరా అని మేఘారెడ్డి ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకని కాలం వచ్చిందన్నారు.

## ఆక్రమణదారులను ఖాళీ చేయించాలి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తక్షణమే ఖాళీ చేయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. నిజమైన లబ్దిదారులకు న్యాయం చేయాలని ఈ దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఇండ్ల సమస్య కేటాయింపుపై అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌజింగ్ సెక్రటరీ జ్యోతిబుద్ధప్రకాశ్ ప్రజావాని నోడల్ అధికారి దివ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డా.హరీష్, కె.శశాంక్, తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణిలో గృహ నిర్మాణానికి సంబంధించి వచ్చే ఫిర్యాదులను సచివాలయంలోని తన కార్యాలయానికి పంపించాలని నోడల్ అధికారి దివ్యకు సూచించారు. వాటి పరిష్కారానికి తన కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించడం జరగుతుందని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



బుధవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య,పాలకమండలి సభ్యులు

## రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి: విసి జానయ్య

**అత్తాపూర్ అక్టోబరు30,ప్రభాతవార్త :** వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రతి రెవిన్యూ గ్రామంలో ఐదు నుంచి పదిమంది అభ్యుదయ రైతులకు విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి నిర్ణయం తీసుకుంది. పాలకమండలి సమావేశం బుధవారం నూతనఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగింది. అనేక కీలకంశాలను పాలకమండలిలో చర్చించి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.

## ఎక్సైజ్ అధికారి ప్రభు వినయ్ సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ శ్రీధర్

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** నాలుగు నెలల నుంచి విధులకు హాజరు కాకుండా అటెండెన్స్ రిజిస్టర్, ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకం చేస్తున్న వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్ ప్రభును ఎక్సైజ్, ప్రొహిబిషన్ కమిషనర్ ఇ.శ్రీధర్ సస్పెండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభు వినయ్‌కుమార్ గత 4 నెలల నుంచి విధులకు హాజరు కాకుండా అటెండెన్స్ రిజిస్టర్, ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు చేస్తూ జీతం తీసుకుంటున్నాడని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ వనపర్తి జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. సర్వీస్ రిజిస్టర్‌లో పుట్టిన తేదీ మార్చుకుని చట్టవిరుద్ధంగా సర్వీస్ పొడిగించుకోవడంతో పాటు సీనియార్టీ లిస్టులో అక్రమాలకు పాల్పడుతున్నాడని అందులో పేర్కొన్నారు. దీంతో ఫిర్యాదుపై ప్రభు వినయ్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిన అధికారులు అతడిని సస్పెండ్ చేశారు.

## సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ సేవలను స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు30:** సంస్థానాల విలీనం ద్వారా స్వాతంత్ర్య భారతదేశ సార్వభౌమత్వానికి నిండుదనాన్ని చేకూర్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అనిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొని యాడారు. సర్దార్‌పటేల్ జయంతిని పుర స్కరించుకుని ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. స్వాతంత్ర్య భారత ప్రథమ ఉప ప్రధాన మంత్రిగా, హోంశాఖ మంత్రిగా ఆయన చూపిన చొరవతోనే వందలాది సంస్థానాలు దేశంలో విలీనమయ్యాయన్నారు. పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# వసతి గృహాల డైట్,కాస్మొటిక్ చార్జీల పెంపు

3 నుంచి 7వ తరగతి- రూ.950 నుంచి రూ. 1,330కి పెంపు

8 నుంచి 10వ తరగతి రూ.1100 నుంచి రూ.1540కి పెంపు

ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి రూ.2,100కి

మొత్తం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 7,65,705

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు30:** దీపావళి పండుగవేళ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు,ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ వసతి గృహాలు, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని వసతి గృహాల్లో డైట్ చార్జీలను,కాస్మోటిక్ చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెంచింది. డైట్,కాస్మోటిక్ చార్జీల పెంపునకు అధికారుల కమిటీ చేసిన సిఫార్సు లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. చార్జీల పెంపును ఆమోదిస్తూ ఫైలుపై సిఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఇప్పటి వరకు రూ.950గా ఉన్న డైట్ చార్జీని రూ.1,330కి ప్రభుత్వం పెంచింది. 3వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు రాష్ట్రంలో వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,77,877 మంది. 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇప్పటి వరకు ఉన్న రూ.1100గా ఉన్న డైట్ చార్జీని రూ.1540కి ప్రభుత్వం పెంచింది. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,59,328 మంది. ఇంటర్ నుంచి పీజీ వరకు ఇప్పటి వరకు ఉన్న రూ.1,500గా ఉన్న డైట్ చార్జీని రూ.2,100కి ప్రభుత్వం పెంచింది. ఇంటర్ నుంచి పీజీ వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,28,500 ఉంది. మొత్తం రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 7,65,705 మంది.

**కాస్మోటిక్ చార్జీల పెంపు**

3వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థినులకు ఇప్పటి వరకు రూ.55గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.175కు ప్రభుత్వం పెంచింది. 8వ తరగతి నుంచి 11 సంవత్సరాలపైన ఉన్న విద్యార్థి నులకు ఇప్పటి వరకు రూ.75గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.275కు ప్రభుత్వం పెంచింది. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఇప్పటి వరకు ఉన్న రూ.62 నుంచి రూ.150కు ప్రభుత్వం పెంచింది. 8 నుంచి పదో తరగతి వరకు... 11 ఏళ్లపబడిన విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.62గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.200కు ప్రభుత్వం పెంచింది.

## కేంద్రం ఇచ్చిన నిధులెక్కడికి పోయాయి: ఎంపి రఘునందన్‌రావు



**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు మండిపడ్డారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద రూ.1200కోట్ల విడుదల చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుందన్నారు. మిగిలిన రూ.1000కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామపంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. పల్లె ప్రగతి నిధులు వెచ్చించడం లేదని దుయబట్టారు.

పంచాయతీ కార్యదర్శులు సొం తంగా పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారన్నారు.

# రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోంది

### మిల్లర్ల నుంచి రికవరీ చేయకుండా మళ్లీ ధాన్యం అప్పగించడం వెనుక ఉన్న చీకటి ఒప్పందం ఏమిటి?: బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిమయమైన పరిపాలన సాగిస్తుందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, వసూళ్లు విచ్చలవిడిగా జరుగుతుందని, అదే సమయంలో పరిపాలన మాత్రం సక్రమంగా కొనసాగడం లేదన్నారు. తెలంగాణలో అన్ని అంశాలు అవినీతిమయం అయ్యాయన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి పనులు పేరుతో కాంట్రాక్టులు, కమిషన్ల దందా సాగుతుందన్నారు. జిఓలను కూడా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదన్నారు. కేవలం ఢిల్లీకి వందల కోట్లు చెల్లించేందుకు వసూళ్లు చేయడం తప్పా ప్రజలకు ఇచ్చిన హామీలపై ధ్యాస లేదన్నారు.

రూ.1150కోట్ల సివిల్ సప్లై కుంభకోణంలో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల నుంచి రికవరీ చేయకుండా మళ్లీ ధాన్యం అప్పగిస్తున్నారని అన్నారు. దీని వెనుక చీకటి ఒప్పందం ఏమిటని ప్రశ్నించారు. ఇందులో సిఎంకు, సివిల్ సప్లై మంత్రుల ప్రమేయం ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలకులు మిల్లర్ల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కోనుగోలు వ్యవహారంలో జిఓనెంబరు 27ను తీసుకుని వచ్చి అక్రమాలకు పాల్పడితే మిల్లర్లకే బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటన్నారు. 20వేల కోట్ల ధాన్యం మిల్లర్ల నుంచి రావాల్సి న ఉందని చెప్పిన మంత్రి రికవరీ ఎందుకు చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని, ప్రజాక్షేత్రంలో పోరాడుతామని చెప్పారు. బిఆర్ఎస్ పాలనా విధానాలనే అనుసరిస్తూ వందల కోట్ల దోపిడికి కాంగ్రెస్ పాలకులు పాల్పడుతున్నారన్నారు. మిల్లర్లు, కాంట్రాక్టర్ల డిఫాల్టర్ల లిస్టులను బయటపెట్టడమంటే ప్రభుత్వం బయటపెట్టడం లేదన్నారు. సన్నబియ్యం నిబంధనల అమలు సాధ్యం కాదని మిల్లర్లు చెప్పినా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడటం లేదన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా హైడ్రా వలంటీర్లు



ట్రాఫిక్ విధుల్లో పాల్గొన్న హైడ్రా వాలింటర్లు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివార్లలో ట్రాఫిక్ గజిబిజిని చక్కదిద్దేందుకు ఇక ముందు ట్రాఫిక్ పోలీసులకు తోడుగా హైడ్రా వాలింటర్లు సహాయం అందించనున్నారు. గ్రేటర్ పరిధిలోని కీలక జంక్షన్లలో హైడ్రా వాలింటర్లు ట్రాఫిక్ విధుల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించి మొదటి విడతగా 50 మంది వాలింటర్లను హైడ్రా డిఆర్ఎఫ్ ఎంపిక చేసి శిక్షణ కూడా ఇచ్చింది. వీరంతా శనివారం నాడు ట్రాఫిక్ విధుల్లో చేరారు. ట్రాఫిక్ పోలీసులు ఎంపిక చేసిన జంక్షన్లలో వీరు విధులు నిర్వహిస్తారు. కాగా మలి విడతగా మరికొందరు త్వరలో ట్రాఫిక్ విభాగంలో చేరనున్నారు. హెచ్ఎండిఎ పరిధిలో చెరువుల సంర క్షణకు ఏర్పాటైన హైడ్రా ఇదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులకు తన వంతుగా సహాయం అందించేందుకు నిర్ణయించడం తెలిసిందే. హైడ్రా చీఫ్‌గా వున్న రంగనాథ్ ఇంతకు ముందు నగర ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్‌గా పనిచేయడం విదితమే. ఆ సమయంలోఆయన హైదరాబాద్‌తోపాటు సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ వ్యవహారాలకు నోడల్ అధికారిగా కూడా వున్నారు. దీంతో గ్రేటర్‌పరిధిలో ఆయనకు ట్రాఫిక్‌కు సంబంధించి మంచి అవగాహన వుండడంతో ప్రస్తుతం హైడ్రా నుంచి కొందరు వాలింటర్లను సిటీ ట్రాఫిక్‌లో సహాయకులుగా పంపుతున్నారు.

# పామాయిల్ సాగులో మలేసియా విధానాలు

### ఉత్పత్తిలో స్వయం సమృద్ధికి చర్యలు: వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతతో పాటు, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కోట్ల రూపాయల వ్యయంతో వివిధ పథకాలను అమలు చేస్తోందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చెప్పారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు మలేషియా తరహా విధానలను అవలంబించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీనికి సంబంధించి ఇటీవల మలేషియా పర్యటనలో అక్కడ పామాయిల్ సాగులో వినియోగిస్తున్న ఉత్తమ పద్దతులు, ప్రాసెసింగ్, రిఫైనరీ, ఇతర ఉత్పత్తులు, యాంత్రీకరణ, సీడ్ గార్డెలను పరిశీలించడం జరగిందని వివరించారు. అక్కడి సాగు విధానాలను తెలంగాణలో అమలు చేసి, పామాయిల్ విస్తరణను వేగవంతం చేస్తామన్నారు. మలేషియాలో ఉన్నట్లు పామా యిలన బోర్డును రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. సాంకేతిక బదిలీ, మానవ వనరుల అభివృద్ధి, నర్సరీలు, మంచి వ్యవసాయ పద్దతులు, పామాయిల్ యాంత్రీకరణ, ప్రాసెసింగ్ మిల్స్, ఉప ఉపత్తుల తయారీతో అధునాతన సాంకేతికతను అందించేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలియ చేశారు. అలాగే అక్కడ ఉన్నట్లుగా సీడ్ గార్డెన్, విత్తన మొలకల తయారీ యూనిట్లను తెలంగాణలో ఏర్పాటు చేసుకుని, రాష్ట్రానికి పామాయిల్ సీడ్‌ను తక్కువ ఖర్చు, ఎక్కువ నాణ్యతతో ఇక్కడే తయారు చేసి, రైతులకు సరఫరా చేసేందుకు మలేషియా సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. సుస్థిరమైన ముడి పామాయిల్ ఉత్పత్తి, వినియోగానికి సంబంధించిన ధృవీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అక్కడి ప్రభుత్వం, సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్న కంపెనీలకు, ప్రత్యేకంగా తెలంగాణ ఆయిల్ ఫెడ్‌తో కలిసి పని చేసేందుకు తగిన సహాయ, సహకారాలను అందించేందుకు ముందుకు వచ్చాయని వివరించారు. అంతేకాకుండా ముడి పామాయిల్ కొనుగోలుదారులతో అనుసంధానం చేయడానికి, రైతులతో కలిసి పనిచేయడానికి, ప్రతీ ఎకరానికి దిగుబడి పెరిగే విధంగా, రైతులు ఉత్పత్తి చేసిన పామాయిల్ గెలలకు అధిక విలువను సృష్టించడానికి కావాల్సిన చర్యల విషంలో తగిన సహాయ సహకారాలు అందించేందుకు సుముఖంగా ఉన్నాయని వెల్లడించారు. అంతేకాకుండా మలేషియాలో పామాయిల్ గెలల కోతకు వాడుతున్న అధునాత పరికరాలను రాష్ట్రంలో కూడా రైతులకు అందుబాటులో తీసుకొచ్చి, తక్కువ ధరలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పామాయిలన పరిశ్రమలో ఒఈఆర్ మెరుగుపచ్చడానికి, అత్యాధునిక సాంకేతికత, యంత్రాలను కొనుగోలు చేయడానికి, ఉత్పత్తులకు అదనపు విలువనిచ్చేందుకు యూనిట్లను తెలంగాణలో ఆయిల్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పామాయిల్ గెలల ధరలు పెరిగేటట్టుగా కనీసం టన్నుకు 20 వేల రూపాయలకు పైగా రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు.

# విద్యుత్ సబ్సిడీగా రూ.11,499 కోట్లు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో అందుకు గానుపంపిణీ సంస్థలకు సబ్సిడీ కింద 11,499 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సబ్సిడీ మొత్తాన్ని దశల వారీగా ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మొత్తంలో గృహ జ్యోతి పథకంలో భాగంగా నెలకు 200 యనిట్ల ఉచిత విద్యుత్ నిమిత్తం సబ్సిడీ కింద 1,699.45 కోట్ల రూపాయలు, వ్యవసాయం, ఇతర వర్గాల వారికి ఇచ్చే ఉచిత విద్యుత్‌కు 9,800.07 కోట్ల రూపాయలు భరించనున్నట్లు ప్రభుత్వం రెగ్యులేటరీ కమిషన్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఉచిత విద్యుత్ సరఫరా చేసినందుకు గాను ఈ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం భరించేందుకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.



## దీపావళి మనందరిలో నవ్యకాంతులు తీసుకురావాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** దీపావళి పండగ కుటుంబానికి సుఖశాంతులను, సమృద్దిని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హిందూ బంధువులందరికి దీపావళి పర్వదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రావణుడిని సంహరించిన తరువాత విజయోత్సాహంతో రాముడు అయోధ్యకు వచ్చిన సందర్బంగా జరుపుకునేదే దీపావళి పండగ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక, అమవాస్య చీకటిలో దీపాల వెలుగులు విరజిమ్ముతున్నట్లే, ఈ దీపావళి పండగ మనందరి జీవితా ల్లోనూ నవ్యకాంతులు తీసుకుని రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.



## సుఖసంతోషాలు నిండాలి : టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 30,ప్రభాతవార్త:** చీకటి వెలుగుల పండుగ దీపావళి తెలంగాణ ప్రజల జీవితాలలో వెలుగులు నింపి సుఖ సంతోషాలు వెల్లివిరి యాలని ఆకాంక్షిస్తూ టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలంగాణీయులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ప్రజా ప్రతినిధులకు ఆయన హృదపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## వెలుగులు పంచే పండుగ దీపావళి: మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** చీకటిని వెలుగు పారద్రోలినట్టే ఎప్పటికైనా అధర్మంపై ధర్మం విజయం సాధిస్తుం దని దీపావళి పండుగ తెలియజేస్తుం దని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాంకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిష్టతో అడుగులు వేస్తున్నదని ఈ సందర్భంగా మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## 8 జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలోని ఎనిమిది జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అనుకూలమైన జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికను రూపొందించింది. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్థారించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని లక్ష్యంగా కలిగి ఉంది. తెలంగాణలో అధికారులు నిర్థారించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, కొత్తగూడెంలో 11 వేల ఎకరాలు, నల్లగొండలో 6,700 ఎకరాలు, మహబూబాబాద్‌ల 5,000 ఎకరాలు, సిద్ధిపేట్‌లో 4,800 ఎకరాలు, సూర్యాపేట్‌లో 4,800 ఎకరాలు, నిర్మల్‌లో 4,200 ఎకరాలు, జగిత్యాలలలో 3,850 ఎకరాలు, వరంగల్‌లో 3,800 ఎకరాలు, భువనగిరిలో 3,500 ఎకరాలు, జనగామ్‌లో 3,400 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,000 ఎకరాల్లోనూ ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని లక్ష్యాలను నిర్ణయించింది.

## రైతు బీమాకై కొత్తగా 2.03 లక్షల మంది అర్హత

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2 లక్షల 3 వేల 210 మందికి చెందిన దరఖాస్తులు రైతు బీమా పథకానికి అర్హత ఉన్నట్లు గుర్తించారు. రైతు బీమా నిమిత్తం కొత్తగా 2.74 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దీంతో బీమా నిమిత్తం కొత్తగా వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి అర్హతలు ఉన్న వారిని వ్యవసాయ శాఖ అధికారులు బీమా పథకంలో చేర్చారు. ఈ ఏడాది జూన్ 28వ తేదీ వరకూ కొత్తగా మొత్తం 3.22 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చినట్లు ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. వీటిలో 3 లక్షల 22 వేల 582 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా, వాటిని పరిశీలించిన అధికారులు అందులో 2,03,210 మంది రైతులను ఈ పథకం కింద అర్హత సాధించారు.

# పోలీసుల విచారణకు హాజరైన రాజ్ పాకాల

### రాజ్ సమక్షంలో ఫాం హౌజ్‌లో పోలీసుల సోదాలు

### సోదాల సమయంలో బిఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ హాజరు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా జన్వాడలో కెటిఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాం హౌజ్‌లో శనివారం జరిగిన పార్టీకి సంబంధించి జరిగిన వివాదంలో అభియోగాలు ఎదుర్కొంటున్న రాజ్ పాకాల బుధవారం నాడు పోలీసుల విచారణకు హాజరయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో రాజ్ పాకాల ఫాం హౌజ్‌లో పరిమితికి మించిన శబ్దంతో పాటలు, వాయిద్యాలు వస్తుండడంతో దీనిపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మోకిల పోలీసులతో పాటు సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు దాడులు జరపడం తెలిసిందే. ఈ సందర్భంగా రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ సేవించినట్లు వైద్య పరీక్షలో తేలింది. ఈ పార్టీకి హాజరైన వారిలో అనేక మంది మద్యం సేవించి వుండడం, కొందరు తూలుతూ వుండడం విదితమే. ఈ సందర్భంగా 22 మంది పురుషులతో పాటు 18 మంది మహిళలు, ఐదుగురు చిన్నారులు అక్కడ వుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలి వేశారు. కొందరు అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు చేయగా రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇదే సమయంలో అనుమతి లేకుండా వున్న 12 విదేశీ మద్యం సీసాలు, పన్ను చెల్లించని ఇతర రాష్ట్రాల మద్యం కూడా పట్టుబడింది. దీంతో పాటు క్యాసినో గేమ్‌కు సంబంధించిన కాయిన్స్, పేక ముక్కలు కూడా లభ్యమయ్యాయి. దీంతో పోలీ సులు ఫాం హౌజ్ నిర్వాహకుడు రాజ్ పాకాలపై అబ్కారీ చట్టంతో పాటు అనుమతి లేకుండా విదేశీ మద్యం వాడినందుకు మరో కేసు, డ్రగ్స్ వాడినందుకు ఇంకో కేసు నమోదు చేశారు. మోకిలలో ఎనిమిది ఎకరాలలో ఈ ఫాం హౌజ్ విస్తరించి వుందని, ఇక్కడ తరచూ పార్టీలు జరుగుతుంటాయని పోలీసులు తేల్చారు. కాగా పోలీసు ల దాడుల సందర్భంగా మొదట నోటీసులు అందుకుని విచారణకు సహకరిస్తానని చెప్పిన రాజ్ పాకాల ఆ తరువాత అక్కడి నుంచి పారిపోయాడని పోలీసులు తెలిపా రు. దీంతో రాయదుర్గంలోని అతనిఇ ఇంటికి వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చి సోమవారం నాడు విచారణకు రావాలని కోరగా అతను రాలేదు. దీంతో రాజ్ పాకాల కోసం పోలీసులు గాలింపు చేబట్టగా బుధవారం నాడు తన న్యాయవాదిని వెంట బెట్టుకుని విచారణకు హాజర య్యారు. కాగా రాజ్ పాకాలను నార్సింగి ఎసిపి రమణ గౌడ్ నేతృత్వంలోని పోలీసు బృందం మూడు గంటల పాటు విచారించింది. ఈ సందర్భంగా పార్టీలో డ్రగ్స్ సేవించి దొరికిపోయిన విజయ్ మద్దూరిని ఎదురుగా వుంచి రాజ్ పాకాలను విచారించాలని పోలీసులు భావించినా అతను హాజరు కాలేదు. దీంతో రాజ్ పాకాలను మాత్రమే పోలీసులు విచారించారు. ఈ విచారణలో విజ య్ మద్దూరి గురించి పోలీసులు ఎక్కువగా ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. విజయ్ మద్దూరికి కొకైన్ సరఫరా చేసింది ఎవరు...? అతను ఎప్పటి నుంచి కొకైన్ తీసుకుంటున్నాడు...? అతని ఏమైనా నేర చరిత్ర వుందా...? కొకైన్‌తో పాటు మరేదైనా డ్రగ్స్ తీసుకుంటాడా...? అనే కోణంలో పోలీసుల విచారణ సాగింది. విజయ్ మద్దూరితో వున్న సంబంధం ఏమిటీ...? ఎప్పటి నుంచి అతను మీకు తెలుసునని పోలీసులు రాజ్ పాకాలను ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ తరువాత పోలీసు లు రాజ్ పాకాలను పోలీసులు అతని ఫాం హౌజ్‌కు తీసుకుని వెళ్లి అక్కడ కొంతసేపు సోదాలు నిర్వహించారు. ఫాం హౌజ్‌లో పార్టీలు తరచూ జరుగుతాయా...? ఎ ప్పుడైనా జరుగుతాయా...? విజయ్ మద్దూరి సేవించిన డ్రగ్స్ ఫాం హౌజ్‌లో ఎలా వచ్చింది...? అని పోలీసులు రాజ్ పాకాలను ప్రశ్నించినట్లు తెలిసింది. ఫాం హౌజ్‌లో జరిగిన పార్టీపై మోకిల పోలీసులు ఇప్పటికే రాజ్ పాకాలతో పాటు విజయ్ మద్దూరి, ఫాం హౌజ్ మేనేజర్ కార్తిక్‌పై కేసులు నమోదు చేయడం తెలిసిందే. కాగా ఫాం హౌజ్‌లో రాజ్ పాకాలను విచారించే సమయంలో ఆదిలాబాద్‌కు చెందిన బిఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ హాజరయ్యారు. జాన్సన్ నాయక్, రాజ్ పాకాల సమక్షంలోనే పోలీసులు ఫాం హౌజ్‌లో సోదాలు జరిపారు.

**విజయ్ మద్దూరి ఇచ్చిన ఫోన్ మరో మహిళది:** కాగా ఈ కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. ఫాం హౌజ్ పార్టీలో డ్రగ్స్ తీసుకుని పట్టుబడ్డ విజయ్ మద్దూరి శనివారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఫోన్ ఇవ్వాలని కోరితే తన ఫోన్ ఇవ్వకుండా మరో మహిళ ఫోన్‌ను ఇచ్చినట్లు ఎసిపి రమణ గౌడ్ తెలిపారు. విజయ్ మద్దూరి విచారణకు రాకపోవడంతో మంగళవారం నా డు జూబ్లీహిల్స్‌లోని అతని ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు ఎసిపి తెలిపారు. విజయ్ మద్దూరి పోలీసులకు ఇచ్చిన ఫోన్ తనదని మరో మహిళ చెప్పడంతో అతను చేసిన మోసం వెలుగు చూసింద ని ఆయన వెల్లడించారు. ఈ కేసులో విజయ్ మద్దూరి విచారణకు పిలిచినా హాజరు కాకుండా పరారీలో వున్నాడని, అతన్ని రెండు రోజుల పాటు అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించిందని ఎసిపి తెలిపారు. ఈ కేసులో అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



## నూతన కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నిర్మాణంపై అసెంబ్లీ సమీక్ష

### క్లబ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలం ఎంపిక

### సమీక్షలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్, చైర్మన్ గుత్తా,డిప్యూటీ సిఎం భట్టి,మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు 30:** శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులు, మాజీ సభ్యుల సౌకర్యార్థం నూతన కాన్సిట్యూషన్ క్లబ్ నిర్మాణంపై బుధవారం అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆదర్శ్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలం కాన్సిట్యూషన్ క్లబ్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. త్వరితగతిన డిజైన్లు రూపొందించాలని ఆర్అండ్‌బి శాఖ అధికారులను స్పీకర్,చైర్మన్,మంత్రులు ఆదేశించారు. రాజస్థాన్, ఢిల్లీలలోని కాన్సిట్యూషన్ క్లబ్‌ల పనితీరును పరిశీలించి రిపోర్టు తయారు చేయాలని అసెంబ్లీ కార్యదర్శికి డిప్యూటీ సిఎం భట్టి,మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. కాన్సి ట్యూషన్ క్లబ్‌ను సొసైటీగా రిజిస్ట్రేషన్ చేయాలని నరసింహాచార్యులను ఆదేశించారు. సభ్యులకు అన్ని వసతులు, సౌకర్యాలు ఉంటూ తెలంగాణ కాన్సిట్యూషన్ క్లబ్ దేశంలో ఒక మోడల్‌గా ఉండే విధంగా ఆర్కిటెక్చర్ సంస్థల ద్వారా డిజైన్లు రూ పొందించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు.

# 5న రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు రాక

### భారత రాజ్యాంగ పీఠికకు అనుగుణంగా సర్వేతో సమాచార సేకరణ : డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ అక్టోబరు 30 ప్రభాతవార్త:** సోషల్ ఎకనామిక్ సర్వే ద్వారా ఆర్థికంగా వెనుకబడివారికి చేయూత ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన కులగణ సమావేశంలో ఆయన మాట్లాడినారు. అంతకు ముందు ఆయన విలేఖరులతో కులగణ ఆవశ్యకత వివరించారు,. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామి మేంకు మా ప్రభుత్వం కులగణన అమలు చేస్తున్నదని తెలిపారు. నవంబర్ 5న రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది అప్పుడు ఒక సమావేవంకూడా ఆయన ఆధ్వర్యంలో కులగణన సామాజిక న్యాయం పై ఏర్పాటు చేస్తామని భట్టి తెలిపారు. కులగణతో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఇంకా ఏం చేయవచ్చో తెలుసుకొనేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. సంక్షేమపథకాలకు ఎంతమేరకు నిధులు ఏఏవర్గాల ఆర్థిక అభివృద్ధికోసం కేటాయించడానికి ఒక స్పష్టత వస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రస్థాయిలో పార్టీలకు అతీతంగా ఒక మీటింగ్ కులగణపై ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశం మొత్తం తెలంగాణ కులగణన ఒక ఎక్సె రేలా ఉపయోగపడేలా చేపడుతామని తెలిపారు. రాహుల్‌గాంధీఇచ్చిన మాట ప్రకారం కులగణ అమలు చేస్తామని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కాంగ్రెస్‌పార్టీలలో కులగణపై మీటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. కులగణన చేస్తే సమాజంలో అందరికి సమాన హక్కులు ఇచ్చే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. రాజ్యాంగంలో సమాన హక్కులు చాల ముఖ్యమైంది అని అన్నారు.

కులగణన రాజ్యంగం మూల సూత్రం కాపాడుతోందని దేశానికి మనం ఒక సమానత్వ సందేశం చెప్పుతున్నాం అని ఆయన అన్నారు. కులగణనకు తెలంగాణ పరిశోధక కేంద్రంగా ఒక మోడల్‌గా నిలిచి దేశానికి సందేశం ఇవ్వబోతుందని డిప్యూటీ సిఎం ఆకాంక్షను వ్యక్తం చేశారు.ఈ సర్వేపై జరిగే చర్చలో సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములనుచేస్తామని అందరికి ఆమోదయోగ్యమైన రీతిలో సర్వే జరుపుతామని ఏ అంశం కూడా లోటు ఉండకుండా సర్వేసమగ్రంగా ఉంటుందని ఆయన తెలిపారు. బిసి,ఎస్సీ,ఎస్టీ కమీషన్లు ఆయా శాఖల ఉన్నతాధికారులను కూడా భాగస్వాములు చేస్తామని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ఆలోచనలు పొందుపరిచేలా సర్వే జరుగాలని ఆదేశాలు జారీచేశామనితెలిపారు. సోషియో ఎడ్యుకేషన్ ఎకనామిక్ పొలిటికల్ అంశాలపై సమాచారాన్ని సర్వేలో సేకరిస్తామని తెలిపారు.

భారతరాజ్యాం గంలోని పీఠిక తూచాతప్పకుండా పాటిస్తూ సర్వే ద్వారా వచ్చినసమాచారం ఆధారంగా సమా జంలోని రోగాలకు చికిత్స చేస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీ సైనికులుగా ఆయన ఆలోచనలను పకడ్బందిగా అమలు చేసిచూపిం చాల్సి న బాధ్యత పార్టీనేతలు,శ్రేణులపై ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలో కాంగ్రెస్ కమిటిలు విస్తృతంగా అభిప్రాయాలను సేకరిస్తాయని ,రాష్ట్రస్థాయిలో మేధావులు సామాజిక వేత్తలు ప్రగతిశీల వాదులతో ఈనెల 5న హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమాజంలో ఉన్న వనరులు అందరికి సమానంగా అందుతున్నాయని లేదా అనేదిసర్వే ఆధారం గాస్పష్టం అవుతుందని ఆయన తెలిపారు. సమా చారం ఆధారంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటా యని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ సామా జిక న్యాయం కల్పించేందుకు దేశంలో పర్యటన చేశారని మోటారు సైకిల్ మెకానిక్ నుంచి మొదలు కొని దళిత, గిరిజనలతో కలిసి వంటచేసుకుంటూ వారితో తిరుగుతూ వివిధ అంశాలు వారినుంచి తెలుసుకొన్నారని దేశంలోని వివిధ సామాజిక వర్గాలన తప పర్యటనలో కలిసి ఆ ఆనుభవంతోనే అన్నిసామాజిక వార్గలకు న్యాయం చేయాలని రాహుల్ విధానం ఏర్పాటు చేసుకొన్నారని ఆయన తెలిపారు. కులగణ ద్వా రా చికిత్స చేసి రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమ లు చేయడానికి వీలవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ సంవత్సరం ఫిబ్ర వరి 4న జరిగే కెబినెట్ సమావేశంలో కుల గణన పై తీర్మానం చేశామని భట్టి గుర్తుచేశారు. శాస నసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశామని దీని ఆధారంగా అక్టోబర్ 10న సమగ్రకుల గణన జివో జారీ చేసనట్లు ఆయన తెలిపారు.

సర్వేలో ఏఏ ప్రశ్నలు ఉండాలని ఏఏ అంశపై సమాచారం సేకరించాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఒకసమావేశం ఏర్పాటు చేస్తున్నామని, పార్టీశ్రేణులు, నాయకులు సూచించే ప్రశ్నలు సర్వేలో ఉంటాయని తెలిపారు.

## 2న ఆస్ట్రేలియాలోని కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు స్పీకర్,మండలి చైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు30:** కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్(సీపీసీ) సదస్సుకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్,అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు హాజరు కానున్నారు. ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరంలోని 67వ సీపీసీని నవంబర్ 3 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు. ఈ సదస్సు కోసం నవంబర్ 2న సాయంత్రం మన రాష్ట్ర నుంచి స్పీకర్,చైర్మన్,డిప్యూటీ చైర్మన్,అసెంబ్లీ కార్యదర్శి బయలుదేరి వెళ్లనున్నారు. భారతదేశంతో పాటుగా ప్రపంచంలోని వివిధ దేశాల చట్టసభ ప్రిసైడింగ్ అధికారులను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఈ సదస్సు అనంతరం కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో ప్రతి సంవత్సరం వివిధ దేశాల్లో నిర్వహిస్తుంటారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా చట్టసభలు వాటిల్లో జరుగుతున్న చర్చలు,తీరు తెన్నులపై చర్చిస్తారు. దీంతో పాటు ఇదే సదస్సులో 8వ వుమెన్ పార్లమెంటేరియన్స్ సదస్సు జరగనుంది. 2024 కామన్‌వెల్త్ పార్లమెంటేరియన్ అవార్డు లను ప్రధానం చేస్తారు.

సదస్సు అనంతరం న్యూజీలాండ్,జపాన్ తదితర దేశాల్లో పర్యటించి నవంబర్ 16న రాష్ట్రానికి చేరుకుంటారు.

## ప్రజలపై భారాలు పడకుండా చూస్తాం

### విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నూతన చైర్మన్ నాగార్జున

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలపై కరెంటు భారాలు పడకుండా చూస్తామని తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (టిజిఈఆర్సీ) నూతన చైర్మన్ జస్టిస్ డాక్టర్ దేవరాజు నాగార్జున స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఈఆర్సీ కార్యాల యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమక్షంలో విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌గా నాగార్జున బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో తనపై గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు. ఇటు ప్రజలు, అటు విద్యుత్ శాఖ పరంగా సమన్వా యంతో వ్యవహరించాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం విద్యుత్ వినియోగదారులు, స్టేక్ హోల్డర్లతో సమన్వయం చేసుకువెళ్లాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యనక్రమంలో ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఈఆర్సీ మాజీ ఛైర్మన్ శ్రీరంగరావు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తదితరులు పాల్గొన్నారు. కాగా 1986లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్న నాగార్జున 1991 మే 1వ తేదీన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2004లో సీనియర్ సివిల్ జడ్జిగా, 2019 సెప్టెంబరు నుండి కామారెడ్డి జిల్లా జడ్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2022 అక్టోబరు 18న హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. 2023 ఏప్రిల్‌లో మద్రాసు హైకోర్టుకు బదిలీ కాగా, అక్కడే పదవీ విరమణ చేశారు. కాగా తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన జస్టిస్ నాగార్జున అక్కడే ప్రభుత్వ పాఠశాలలో హైస్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, గుల్బర్గాలో ఎల్ఎల్‌బీ చదివారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చేశారు. అమెరికాలోనూ న్యాయ శాస్త్రంలో పలు కోర్సులు అభ్యసించారు.

## సచివాలయం భద్రత నుంచి టిజిఎస్‌పి తొలగింపు

### ఎస్‌పిఎఫ్‌కు అప్పగింత

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** బెటాలియన్ల సిబ్బంది ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం భద్రత నుంచి తెలంగాణ స్పెషల్ పోలీసు బలగాలను తొల గించారు. ఈ మేరకు డిజిపి జితేందర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్ల స్థానంలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్)కు సచివాలయం భద్రతను అప్పగించారు. వాస్తవానికి మొదట్లో సచివాలయ భద్రతను ఎస్‌పిఎఫ్ బలగం సర్యవేక్షించేది. అయితే నూతన సచివాలయం భవనం నిర్మాణం అ య్యాక ఎస్‌పిఎఫ్ స్థానంలో తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్ సిబ్బందిని ఏడాది క్రితం నియమించారు. అప్పటి నుంచి బెటాలియన్ల సిబ్బంది వంతుల వారిగా ఇక్కడ భద్రతను పర్యవేక్షించే వారు. వీరికి స్థానిక సైఫాబాద్ పోలీసులు సహకరించే వారు అయితే పది రోజులుగా బెటాలియన్ల సిబ్బంది ఆందోళన చేస్తుండడం, దీని పై డిజిపి జితేందర్ హామీ ఇచ్చినా వారు దిగి రాకపోవడంతో బెటాలియన్ల సిబ్బందికి సచివాలయ భద్రత నుంచి ఉద్వాసన పలికారు. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి ఇం టి వద్ద భద్రత నుంచి బెటాలియన్ల సిబ్బందిని తొలగించి వారి స్థానంలో సాయుధ బలగం సిబ్బందిని నియమించడం తెలిసిందే.

# ఆశాజనకంగా లేని ఆదాయం

### ఆరు నెలల్లో రూ.1.08 లక్షల కోట్ల రాబడి

### పన్నుల రెవెన్యూ రూ.69 వేల కోట్లు

### వార్షిక బడ్జెట్‌లో 39.41 శాతం నమోదు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆశించిన అదాయం సమకూరలేదు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి అర్థ భాగానికి అంటే ఏప్రిల్ నుండి సెప్టెంబరు నెలాఖరు వరకూ వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న 2.74 లక్షల కోట్ల రూపాయలకు గాను 39.41 శాతం చొప్పున 1.08 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే ఖజానాకు అదాయం చేరింది. ఆర్థికశాఖ నివేదిక ప్రకారం ఈ అదాయంలో పన్నుల ద్వారా 69 వేల కోట్ల రూపాయలు సమకూరాయి. అయితే బడ్జెట్‌లో 1.64 లక్షల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వస్తుందని అంచనా వేయగా, ఈ కాలానికి కనీసం 82 వేల కోట్ల రూపాయల మేర రెవెన్యూ రావాల్సి ఉంది.

ఈ లెక్కన అంచనాల కంటే 13 వేల కోట్ల రూపాయల మేర పన్నుల అదాయం తగ్గింది. జీఎస్టీ కింద 24,732 కోట్ల రూపాయలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 7,251 రూపాయలు, అమ్మకం పన్ను ద్వారా 16,081 కోట్ల రూపాయలు, ఎక్సైజ్ పద్దు కింద 9,492 కోట్ల రూపాయలు సమకూరాయి. పన్నేతర అదాయానికి వస్తే ప్రస్తుత వార్షిక బడ్జెట్ అంచనా ప్రతిపాదనల్లో 11.65 శాతం మ ఏర 4,101 కోట్లు రూపాయలు మాత్రమే వచ్చాయి. ఇక రెవెన్యూ రాబడులు పోను అప్పుల మీదే ప్రభుత్వం అధారపడినట్లు అర్థిక శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అర్థిక సంవత్సరం అర్థ భాగానికి గాను వచ్చిన 1.08 లక్షల కోట్ల అదాయంలో తెచ్చిన అప్పులే 32,536 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఈ లెక్కన ఖజానాకు చేరిన అదాయంలో 30 శాతం మేర అప్పుల ద్వారా సేకరించిన సొమ్ములే ఉన్నాయి. అలాగే గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం నుండి 21 వేల కోట్ల రూపాయలు వస్తాయని అంచనా వేయగా, అరు నెలల కాలానికి 11 శాతం చొప్పున 2,447 కోట్ల రూపాయలు వచ్చాయి. కాగా ఖర్చులకు సంబంధించి ఈ 2024-25 అర్థిక సంవత్సరంలో 2.54 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని బడ్జెట్‌లో ప్రతిపాదించగా, ఈ కాలానికి 39.75 శాతం మేర 1.01 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

ఇందులో రెవెన్యూ పద్దు కింద 41,802 కోట్ల రూపాయలు, తెచ్చిన అప్పుల కిస్తీలు, వడ్డీ నిమిత్తం 13,187 కోట్ల రూపాయలు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల కింద 21,279 కోట్ల రూపాయలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్ల నిమిత్తం 8,560 కోట్ల రూపాయలు, విద్యుత్, ఉచిత బస్ తదితర వాటికి సబ్సిడీల కింద 6,376 కోట్ల రూపాయల మేర వ్యయం చేసింది.



భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన చిన్నజీయర్ స్వామి

**హైదరాబాద్(చార్మినార్), అక్టోబరు 30 ప్రభాతవార్త :** దీపావళీ సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని బుధవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ స్వామి సందర్శించారు.మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామికి స్వాగతం పలికారు.శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారికి త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.కాగా నరక చతర్థశి సందర్భంగా పలు ప్రాంతాలకుచెందిన భక్తులు చార్మినార్ శ్రీ భాగ్య లక్ష్మి మందిరంలో అమ్మవారికి పూజలు జరిపారు.

## భారత్‌లో బ్రిటన్ రాజ దంపతుల పర్యటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్ 3 ఆయన సతీమణి క్వీన్ కెమిల్లా భారత్‌లో సీక్రెట్ ట్రిప్‌కు వచ్చినట్లుగా పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 27 నుంచి వారిద్దరూ బెంగళూరులో ఉన్నట్లు సమాచారం. అక్కడి ఓ వెల్‌నెస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నట్లు మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. బ్రిటన్ రాజదంపతులు వెల్‌నెస్ కేంద్రంలో యోగా, మెడిటేషన్ సాధనలో సమయం గడుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా వీరు బుధవారం బెంగళూరు నుంచి బ్రిటన్ బయలుదేరుతున్నట్లు సమాచారం. మీడియా కథనాల ప్రకారం కింగ్ చార్లెస్ 3 దంపతులు అక్టోబర్ 21,26 మధ్య కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశానికి హాజరైన తర్వాత సమోవా నుంచి నేరుగా భారత్‌కు రహస్యంగావచ్చారు. సీక్రెట్ ట్రిప్ కావడంతో ప్రభుత్వం ఎలాంటి అధికారిక ఆహ్వాన కార్యక్రమాలు నిర్వహించలేదు. బెంగళూరులోని వెల్‌నెస్ సెంటర్‌లో ప్రత్యేక సిబ్బంది వారికి వివిధ థెరపీ సెషన్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కింగ్ ఛార్లెస్ 3ను బ్రిటన్ రాజుగా అధికారికంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి.

## వేగంగా సాగుతున్న హెల్త్ ప్రొఫైల్ వివరాల సేకరణ

### ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు

### పేరు టైప్ చేస్తే సమగ్ర వైద్య వివరాలు

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సేకరించే కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం అందుతోంది. అయితే, తెల్ల రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించేందకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా ప్రతీ ఒక్కరి సమగ్ర ఆరోగ్య వివరాలు సేకరించాలనీ, దాని ఆధారంగానే డిజిటల్ హెల్త్ కార్డులు అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డు తరహాలో ఒక యునిక్ నంబర్ జారీ చేసి ఆ నంబరు ఆధారంగా అందరి ఆరోగ్య సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తోంది. పేరు టైప్ చేస్తే సమగ్ర వైద్య సేవల వివరాలు తెలుసుకునేలా చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని ప్రజలు ఎవరైనా ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు ఇది తోడ్పడనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా అవసరమైన వారికి వైద్య సేవలు అందజేయనుంది. కాగా, రాష్ట్రంలోని ప్రజల సమగ్ర ఆరోగ్య వివరాలతో కూడిన హెల్త్ ప్రొఫైల్ కార్డులను రూపొందించాలని గతంలోనే ప్రభుత్వం భావించింది. అయితే, గత ప్రభుత్వం కేవలం ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమగ్ర ఆరోగ్య వివరాలతో కూడిన ప్రణాళికను రూపొందించింది. ప్రస్తుతం వీరికి బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నది. దీంతో రాష్ట్రంలోని కొద్ది మందికి మాత్రమే ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. అయితే, ఈ ప్రభుత్వం గత ప్రభుత్వానికి భిన్నంగా రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తి పేరిట హెల్త్ ప్రొఫైల్ రూపొందించి తదనుగుణంగా అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయనుంది. కాగా, హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనలో భాగంగా వైద్య సిబ్బంది రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రతీ వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని సేకరించి ఒక యూనిక్ ఐడీ నంబరు ఇస్తారు.

అలాగేన ప్రతీ వ్యక్తికి సంబంధించిన నమూనాలు సేకరించి అన్ని రకాల డయాగ్నస్టిక్స్ పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా ఆరోగ్య సమస్యలను నిర్ధారిస్తారు. జ్వరం, రక్తపోటు, రక్తహీనత, రక్తంలో చక్కెర స్థాయి, వయసుకు తగ్గ ఎత్తు, బరువు, బ్లడ్ గ్రూపు, శరీర కొలతలు, రక్తంలో ప్రాణవాయువు, గుండె కొట్టుకునే తీరు ఇతర అనారోగ్య సమ స్యలను తీరుస్తారు. ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రక్తం, మూత్ర నమూనాలను సేకరించడం, ఈసీజీ వంటి పరీక్షలు సీబీపీ, సీయూఈ, క్రియాటిన్, రక్తంలో చక్కెర స్థాయిలు తెలుసుకునే మూడు నెలల సగటు హెచ్‌బిఏ1సి, గుండె పనితీరును తెలుసుకునేందుకు కొలెస్ట్రాల్, ఈసీజీ, కాలేయ సంబంధిత పనితీరును తెలు సుకునేందుకు వివిధ కాలేయ పరీక్షలు నిర్వహించి ప్రతీ పౌరుని సమగ్ర ఆరోగ్య వివరాలతో హెల్త్ ప్రొఫైల్ కార్డులు రూపొందించనుంది.

## మళ్లీ తగ్గిన పత్తి ధర, రైతుల ఆందోళన

**హైదరాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా తయారయింది. మార్కెట్లలో పత్తి ధరలు రోజు రోజుకూ పతనం అవుతుండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ధర క్వింటాలు 7,520 రూపాయలుగా ఉంది.కానీ మార్కెట్లలో వ్యాపారులు కూడబలుకుని రైతుల దోపిడీకి తెర తీశారు.

ఈ నేపథ్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒక్క రోజునే 35 వేల బస్తా లు అమ్మకానికి రైతులు తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో గరిష్ట ధర క్వింటాలుకు 6,800 రూ పాయలు పలికినప్పటికీ, వ్యాపారులు సిండికేట్‌గా మారిఏకంగా క్వింటాకు 300 రూపాయలు తగ్గించడంతో రైతులు ఆందోళనలకు దిగారు. అలాగే వరంగల్ జిల్లా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా పత్తి ధర 6,800 రూపాయలు పలికింది.

దీంతో రైతులు అధికారులను నిలదీయడంతో అక్కడ వాగ్వాదాలు చోటు చేసుకుని చివరకు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

## ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె సేవలను స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు30:** నా ప్రతి రక్తపు బొట్టు దేశ పటిష్టతకు తోడ్పడుతుందని ప్రకటించిన మహనీయురాలు మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె సేవలను సిఎం స్మరించుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత,సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ఆమె ముందుకు సాగారని సిఎం తెలిపారు. రాజభరణాల రద్దు,బ్యాంకుల జాతీయీకరణ,20 సూత్రాల కార్యక్రమం వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి,పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ ఎంతగానో కృషి చేశారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుందని,ఆ మహనీయురాలి స్ఫూర్తితోనే పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని చేపడుతున్నామని సిఎం తెలిపారు.

## రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి: మాజీ సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు 30:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కెసిఆర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని,అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని కెసిఆర్ తెలిపారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు.

# కెప్టెన్లు ఔట్!

## మెగా వేలంలోకి డైనమేట్స్
## స్టార్ ప్లేయర్లు వద్దంటున్న ఫ్రాంచైజీలు



ఆట

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2025 మెగా వేలానికి సమయం దగ్గరపడుతోంది. ఫ్రాంచైజీలు ఈ నెల 31, సాయంత్రం 5 గంటల లోపు తమ రిటైన్ ప్లేయర్ల లిస్టలను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డుకు (బిసిసిఐ)కు సమర్పించాల్సి ఉంది. ఈ తరుణంలో కెప్టెన్లు, హేమాహేమీలు, టీ 20 డైనమేట్‌లు నవంబరులో జరిగే వేలంలోకి రానున్నాయి. ఇందుకు అనుగుణంగా ఐపీఎల్ వేలానికి ముందుగా ఆరు ఫ్రాంచైజీలు తమ జట్ల కెప్టెన్లను వదులుకోవాలని భావిస్తున్నాయి. ఈ జాబితాలో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ టీమ్ కెప్టెన్ శిఖర్ ధావన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కెప్టెన్ డుప్లేసిస్, ఢిల్లీ క్యాపి టల్స్ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్, కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ కెఎల్ రాహుల్, గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఉన్నట్లు తెలు స్తోంది. వీరిని ఆయా ఫ్రంచైజీలు వదులుకునేందుకు సిద్ధపడ్డాయి. ఈ ఆరుగులు కెప్టెన్లలో శిఖర్ ధావన్ మినహా మిగిలినవారందరూ త్వరలో జరగబోయే ఐపీఎల్ మెగా వేలంలోకి రానున్నారు. అలాగే సన్ రైజర్స్ హైదరబాద్ ఫ్రాంచైజీలో ఉన్న వాషింగ్టన్ సుందర్‌ను ఆ జట్టులో కొనసాగించే అవకాశం లేదు. అయితే రైట్ టు మ్యాచ్ కార్డు కింద సన్ రైజర్స్ హైదరాబాద్ అతడిని కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ మెగా వేలంలో వీరిలో పలువురిని కోట్ల రూపాయలకు కొనుగోలు చేసేందుకు ఇతర ఫ్రాంచైజీలు కూడా సిద్ధపడుతున్నాయి. ఇక పలు ఫ్రాంచైజీలు పేరొందిన టీ20 డైనమేట్‌లు డికాక్, ఇషాన్ కిషన్, చాహల్, మ్యాక్స్‌వెల్, మిచెల్ స్టార్క్, వార్నర్, రబడా లాంటి అంతర్జాతీయ ప్లేయర్లను విడుదల చేయనున్నాయి. కాగా పలుమార్లు ఛాంపియన్‌లుగా నిలిచిన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌లతో పాటు, గుజరాత్ టైటాన్స్ ఏ ధరకైనా కెప్టెన్లు, టీ20 టైనమైట్లు, హేమాహేమీలైన ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందరి కంటే ముందు మూడు జట్లు టీమిండియా ఆలౌ రైండర్ వాషింగ్టన్ సుందర్‌ను కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నాయి. ఇక రాయల్స్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు కెప్టెన్‌గా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని విరాట్ కోహ్లీ ఆ ఫ్రాంచైజీని కోరినట్లు సమాచారం. అయితే ఇందుకు అంగీకరించకపోతే అక్కడ నుండి బయటకు వెళ్లిపోయే అవకాశా ఉన్నాయని, వేలంలోకి వస్తే కోట్లు రూపాయలు కుమ్మరించి కొనుగోలు చేయాలని వివిధ ఫ్రాంచైజీలు ఎదురు చూస్తున్నాయి.



## బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా 575 పరుగుల భారీ స్కోరు

**ఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా భారీ స్కోర్ దిశగా దూసుకెళింది. చట్టోగ్రామ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు ఫస్ట్ ఇన్నింగ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 144. ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 575 పరుగులు చేసింది. టోనీ డి జోర్జి 177 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 106 పరుగులు, వియాన్ ముల్డర్ 105 పరుగులతో సెంచరీ చేసి కదం తొక్కగా, డేవిడ్ బెడింగ్హామ్ 59 పరుగులు, సెణరన్ ముత్తుస్వామి 68 పరుగులు చేసి అర్ధ సెంచరీలతో రాణించాడు. టోనీ, ట్రిస్టన్‌కు టెస్టుల్లో ఇవి తొలి శతకాలు. ఇక ర్యాన్ రికెల్టన్ 12 పరుగులు, ఆడిన్ మార్క్‌్రమ్ 33 పరుగులు చేశాడు. దీంతో దక్షిణాఫ్రికా స్కోరు 575కు చేరింది. కాగా ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కోల్పోయిన 5 వికెట్లు బంగ్లా స్పిన్నర్ తైజుల్ ఇస్లాం ఖాతాలోకే వెళ్లాయి. తైజుల్ కెరీర్‌లో ఇది 14వ ఐదు వికెట్ల ఘనత. అలాగే బాంగ్లాదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 38 పరుగులు చేసింది.
షద్మాన్ ఇస్లామ్ ఒక్క పరుగు కూడా చేయకుండానే ఔటయ్యాడు. మహ్మదుల్ హస్సా న్ జోయ్10 పరుగుల్లోనే, జకీర్ హుస్సేన్ 2 పరుగులకు, హుసేన్ మహమూద్ 3 పరుగులతో పేలవ ప్రదర్శ న చేశారు. ప్రస్తుతం క్రీజులో మామ్మునల్ హక్ 6 పరుగులు, నజ్మత్ హుస్సేన్ శాంతో 4 పరుగులతో ప్రస్తుతం క్రీజులో ఉన్నారు.




## వన్డే ర్యాంకింగ్స్‌లో మహిళల సత్తా
### దీప్తికి రెండు, స్మృతికి నాలుగు



**ఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన భారత్ మహిళా క్రికెటర్లు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో సత్తా చాటారు. ఈ మేరకు ఐసీసీ వన్డే బ్యాటింగ్, బౌలింగ్, ఆల్ రౌండర్ ర్యాకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ మూడు కేటగిరీల్లోనూ టీమిండియా నుండి దీప్తి, స్మృతిలు మాత్రమే టాప్ 10లో చోటు దక్కించుకున్నారు. మూడు వన్డేల సిరీస్‌లో బంతితో మ్యాజిక్ చేసిన ఆల్ రౌండర్ దీప్తి శర్మ రెండో ర్యాంక్ సాధించింది. ఆమెకు 687 పాయింట్లు రావడంతో ఈ ర్యాంక్ వచ్చింది. ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లోనూ అదరగొడుతూ నాలుగో స్థానంలో దీప్తి నిలిచింది. ఇక ఆఖరి వన్డేలో సెంచరీతో చెలరేగిన ఓపెనర్ స్మృతి మంధాన బ్యాటింగ్ విభాగంలో నాల్గవ ర్యాంక్‌కు ఎగబాకింది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ క్రికెటర్ నాట్ సీవర్ బ్రంట్ అగ్రస్థానం సాధించింది. టీ20 వరల్డ్ కప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ వొల్వార్డ్ రెండో స్థానంలో ఉండగా, శ్రీలంక సారధి చమరి ఆటపట్టు మూడు, స్మృతి నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. కాగా ఆలౌ రౌండర్ల జాబితాలో సఫారీ క్రికెటర్ మరినే కాప్ టాప్‌లో ఉంది. విండీస్ కెప్టెన్ హేలీ మాథూయస్ రెండు స్థానంలోను, నాట్ సీవర్ బ్రంట్ మూడోస్థానంలోను, దీప్తి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన అమేలియా కేర్ 356 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. న్యూజిలాండ్‌కు ప్రపంచ కప్ కలను నిజం చేసిన కెప్టెన్ సోఫీ డెవినె ఏడో ర్యాంక్‌ను కైవసం చేసుకుంది.

**భారత్ పురుషుల జట్టుకు షాక్**

ఈసారి ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారతన పురుషుల జట్టుకు షాక్ తగిలింది. యశస్వి జైస్వాల్ మినహా మిగిలిన ప్లేయర్లు ర్యాంకులు పడిపోయాయి. బంగ్లాదేశ్‌ను చిత్తు చేయడంలో కీలక పాత్ర పోషించిన దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ 860 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరాడు. ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్ వుడ్ 847 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇప్పటి వరకూ అగ్ర స్థానంలో ఉన్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 846 పాయింట్లతో ర్యాంకుల్లో రెండు స్థానాల కిందికి దిగజారాడు. సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 831 పాయింట్లతో రెండు ర్యాంకులను చేజార్చుకున్నాడు. యువ బ్యాటర్ యశస్వి ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో ర్యాంకుకు చేరాడు. రిషబ్ పంత్ 708 పాయింట్లతో ఐదు స్థానాలను కోల్పోయి టాప్ 10 నుండి బయటకు వెళ్లిపోయాడు. ఆలౌరౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, మెహిదీ హాషన్, షకీబ్ అల్ హసన్, జాసన్ హోల్డర్ టాప్ 5లో కొనసాగుతున్నారు.

## 18% పెరిగిన పసిడి డిమాండ్

**ముంబై, అక్టోబరు 30:** దిగుమతి సుంకంలో కోతతో దేశంలో బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో దేశ వ్యాప్తంగా పసిడి గిరాకీ 18శాతం పెరిగి 248.3 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజిసి) పేర్కొంది.
గత యేడాది ఇదే సమయానికి ఆ మొత్తం 210.2 టన్నులుగా ఉంది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కార ణంగా బంగా రానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉండడంతో ఈ యేడాది మొత్తం బంగారం గిరాకీ 700 నుంచి 750 టన్నుల మధ్య ఉండొ చ్చని అంచనా. ధన త్రయోదశి కారణంగా గిరాకీ ఏర్పడడంతో మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.300 పెరిగి రూ.81,400కు చేరు కుంది.

## 11% తగ్గిన వెల్‌స్పన్ నికరలాభం




**ముంబై, అక్టోబరు 30:** వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభాల్లో క్షీణత నమోదయింది. 11శాతం తగ్గి 61.56 కోట్లుగా ప్రకటించింది. జులై–సెప్టెంబరు కాలంలో అంతకుముందు ఏడాది 69.01 కోట్లు ఆర్జించిన లాభాలు ఈ ఏడాది తగ్గినట్లుఎ క్ఛేంజి ఫైలింగ్‌లో నమోదయింది. మొత్తం రాబడులు మాత్రం పెరిగాయి. 692.65 కోట్లనుంచి 837.92 కోట్లకు పెరిగాయి. వ్యయాలు కూడా 595.61 కోట్లనుంచి 736.33 కోట్లకు పెరిగాయి. కంపెనీ ఆర్డర్‌బుక్ కూడా 15,200 కోట్ల వరకూ ఉందని వివరించింది. అలాగే వెల్‌స్పన్ మిచిగాన్ వాటాను పటేల్ ఇంజినీరింగ్ నుంచి 9.99శాతం వాటాలను కొనుగోలు చేసామని, వీటి విలువ 100 కోట్లకూ ఉంటుందని కంపెనీ వివరించింది. వాటా కొనుగోలు తర్వాత వెల్‌స్పన్ మిచిగాన్‌లో మాతృసంస్థ వాటా 50.10 శాతం నుంచి 60.09శాతానికి పెరిగింది. ఈ ఏడాది నవంబరు ఏడో తేదీ నాటికి ఈ లావాదేవీ పూర్తవుతుందని అంచనా. ఇంజి నీరింగ్ కన్‌స్ట్ర క్షన్ కంపెనీగా ఉన్న మిచిగాన్ మౌలిక వనరు లు, జలవనరు ల్లో మౌలికవన రులు, మురుగు నీటి శుద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నది.




## సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని హెచ్చుతగ్గులు

**ముంబై, అక్టోబరు 30:** దీపావళి ముందు రోజు స్టాక్ మార్కెట్లు ఒడిదొడుకులకు లోన య్యాయి. సెన్సెక్స్ 450 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ కూడా 124 పాయింట్ల పడిపోయింది సిప్లా, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలు భారీగా దెబ్బతిన్నాయి. నిఫ్టీలో మిడ్‌క్యాప్ సూచి మాత్రం 287 పాయింట్లు పెరిగి 56,538 పాయిం ట్లకు చేరింది. ఫోర్స్‌మోటార్స్ షేర్లు 20శాతం పెరి గాయి. బిఎస్‌ఇలో 1.19శాతం పెరిగి 542.20కి పెరిగాయి. ఇంట్రాడేస్ కనిష్టం నుంచి కోలుకున్నాయి. అయినా చివరికి సెన్సెక్స్ 0.16 శాతం క్షీణించి 80,238.72 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది. నిఫ్టీ 50 సూచి కూడా 0.099 శాతం క్షీణించి 24,442.60 పాయింట్ల వద్ద లావాదేవీలు నిలిపివేసింది. బ్యాంక్ నిఫ్టీ సూచీలు ఎక్కువ నష్టపోయాయి. ఆటో, ఎఫ్‌ఎంసిజి, ఐటి సెక్టార్ల సూచీలు మిశ్రమంగా ఉన్నాయి. స్మాల్‌క్యాప్ సూచీల్లో అధికశాతం మిశ్రమంగానే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచి స్వల్పలాభాల్లో నడిచింది. 0.01శాతం పెరిగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచి మాత్రం 0.30శాతం పెరిగింది. ఇక నిఫ్టీ 50 సూచి బుధవారం సెషన్‌లో ప్రతికూలంగానే ముగి సింది. 24,371.45 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ప్రారంభించి 95.4పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ చివరకు 24,371.45 పాయింట్ల వద్ద ట్రేడిం గ్ నిలిపివేసింది. ఇకనిఫ్టీ ఫ్యూచర్స్ పరంగా 24,477.7 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ బ్యాంక్‌సూచి బుధవారం చివరకు కాలపరిమితి ముగిసే అవధికి చేరుకోడంతో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. నాలుగువేల పాయింట్లు క్షీణించిన ఈ సూచి గతంలో ఒకదశలో 54,467 పాయింట్ల వద్దకు చేరింది. అయితే ఇన్వెస్టర్లు మాత్రం మంగళవారం మార్కెట్లు ముగిసాక వెలువడిన ఫలితాల కంపెనీలయిన మారికో, ఎంటార్ టెక్, కాంకర్, వోల్టాస్ కంపెనీలపై ఫోకస్ పెంచారు. ఎల్‌అండ్‌టి, బయోకాన్, టాటా పవర్, డాబర్ కంపెనీలు కూడా బుధవారం తమతమ ఫలితాలను వెల్లడించాయి. అయితే ట్రేడిం గ్‌లో మాత్రం మిశ్రమంగానే కనిపించింది. ఇక ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచి 0.04శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచి 1.54శాతంపెరిగింది. మార్కెట్ల తీరుతెన్నులు కొంత స్థిరంగానే కనిపించాయి. సూచీల్లో నిఫ్టీ మీడియా సూచీ 2.34శాతంపెరిగింది. ఎఫ్‌ఎంసిజి 0.92శ్శాతం, హెల్త్‌కేర్‌సూచి 0.30 శాతంమేర పెరిగాయి. ఇక నిఫ్టీ ఆర్థికసేవలు 1.32శాతం, వినియోగరంగ సూచి 1.17శాతం, నిఫ్టీ హెల్త్‌కేర్ 1.10శాతం సూచీలు క్షీణించాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. RNI No.APTEL/2001/7563.Postal Licence Regd. No. H/KAR/89/12-14